


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 122 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : తాడేపల్లిగూడెం శనివారం 14 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 122 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM SAT 14 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## వారిని అంతం చేస్తున్నా



### ఇరాన్‌కు మరోసారి డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక

**పెన్ పవర్ డెస్క్:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్‌కు హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా అధ్యక్షుడిగా వారిని అంతం చేస్తున్నానని ట్రంప్ వ్యాఖ్యానించారు. మతిచ ెడిన నేతలకు ఈరోజు ఏం జరుగుతుందో మీరే చూస్తారని అన్నారు. ఇరాన్ నౌకాదళం ఇప్పటికే కనుమరుగయ్యిందని, ఇక వైమానిక దళం కూడా ఉండదని

మిగతా 2లో

## ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్‌జే దొర కన్నుమూత

**పెన్ పవర్ డెస్క్:**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్‌జే దొర (82) కన్నుమూశారు. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమిం చడంతో, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. హెచ్ జే దొర కొంతకాలంగా కిడ్నీ సమస్యల తో బాధపడుతున్నారు. ఆయన క్రమం తప్పకుండా డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఉదయం హైదరాబాద్ లోని నిమ్స్ లో డయాలసిస్

మిగతా 2లో



## పిఠాపురంలో ఫ్లెక్సీ చిచ్చు...

### సీఎం ఫోటో చిన్నదిగా ఉండటంపై వర్మ ఆగ్రహం



**పెన్ పవర్ డెస్క్:**సీఎం చంద్రబాబుకు అవమానం జరిగిందంటూ టీడీపీ నేత, పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎస్వీఎస్ఎన్ వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోటో చిన్నదిగా ఉందంటూ, వర్మ తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చారు.పిఠాపురం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికుల కోసం ఒక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వర్మ, వేదికపై ఉన్న ఫ్లెక్సీని గమనించి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు చిత్రాన్ని చిన్నదిగా ముద్రించి అవమానించారని ఆయన ఆరోపించారు. "ముఖ్యమంత్రికి గౌరవం లేని చోట నేను కూర్చోలేను" అని మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వేదిక ఎక్కకుండానే అక్కడి నుంచి వెనుదిరిగారు. బయటికి వచ్చిన తర్వాత

మిగతా 2లో

## బడి భోజనంలో తేడాలొస్తే కఠిన చర్యలు

### మంత్రి నారా లోకేశ్ సీరియస్ వార్నింగ్



**పెన్ పవర్ డెస్క్:**ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం విషయంలో రుచి, శుచి, నాణ్యత లేదా పోషక విలువలు తగ్గితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా హెచ్చరించారు. అపర అన్నపూర్ణమ్మ డొక్కా సీతమ్మ పేరుతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకంపై కుట్రలు చేసినా, నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలుపై విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఆయన ఫోన్‌లో సమీక్ష నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం తారక రామానగర్‌లోని మండల పరిషత్ పాఠశాలలో భోజనం బాగాలేదంటూ ఆ స్కూల్ హెడ్మాస్టర్ జాన్ స్వయంగా విద్యార్థులను తప్పుదోవ పట్టించి, సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన ఘటనపై అధికారులు మంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన లోకేశ్, ఇలాంటి కుట్రపూరిత ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని సూచించారు. మన పిల్లలకు పెట్టే భోజనంపై ఎంత శ్రద్ధ తీసుకుంటామో, ప్రభుత్వ బడుల్లోని పిల్లల విషయంలో అంతకంటే ఎక్కువ

మిగతా 2లో

# ముగిసిన ఏపీ క్యాబినెట్ భేటీ...

### రాష్ట్రంలో భారీగా భూ కేటాయింపులు... పరిశ్రమలు, విద్యాలయాలకు పెద్దపీట

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జల జీవన్ మిషన్, పోలవరం ప్రాజెక్టు పనుల వేగవంతం, కడప స్టీల్ ప్లాంట్‌కు భూ కేటాయింపులు, గిరిజన రైతులకు సబ్సిడీలు, మహిళల కోసం హాస్టళ్లు వంటి అనేక ముఖ్యమైన ప్రతిపాదనలను ఆమోదించారు. సమావేశం అనంతరం రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు కేబినెట్ నిర్ణయాలను వెల్లడించారు.



**భూ కేటాయింపులపై కీలక నిర్ణయాలు**

రాయలసీమ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు దిశగా ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు పరిధిలోని పలు గ్రామాల్లో 424.45 ఎకరాల ప్రభుత్వ భూమిని జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సంస్థకు కేటాయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.21.30 కోట్ల చెల్లింపుపై ఈ భూమిని ఏపీఐఐసీకి బదలాయించనున్నారు. రెండేళ్లలో ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

వీటితో పాటు కిమ్స్ ఆసుపత్రికి 2 ఎకరాలు, సంబంధిత ట్రస్టుకు 23 ఎకరాలు, తుళ్లూరు ఎడ్యుకేషన్ సొసైటీకి 3 ఎకరాలు పరిహారంగా కేటాయించారు. బాపట్ల జిల్లాలో లగ్జరీ రిసార్టుల కోసం ఏపీ టూరిజం అథారిటీకి 17 ఎకరాలు, చిత్తూరు జిల్లాలో పర్యాటక అభివృద్ధికి 20 ఎకరాలు, నెల్లూరులో ఈఎస్ఐసీ ఆసుపత్రి నిర్మాణానికి ఎకరం భూమిని కేటాయించారు. ముత్తుకూరులో సింగపూర్ కంపెనీ సీఎస్ఆర్ నిధులు రూ.20 కోట్లతో నిర్మించనున్న ఆసుపత్రి కోసం 86 సెంట్ల భూమిని నామమాత్రపు ధరకు ఇచ్చేందుకు నిర్ణయించారు.

**గిరిజన రైతులకు 100 శాతం సబ్సిడీ**

దాత్రి ఆభా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్‌లో భాగంగా 8 గిరిజన జిల్లాల్లోని అటవీ హక్కు పత్రాలు (ఎఫ్ఆర్ఏ) ఉన్న రైతులకు ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. 'పర్ డ్రాప్ మోర్ క్రాప్' పథకం కింద డ్రిప్ ఇరిగేషన్‌పై 100 శాతం, స్ప్రింక్లర్లపై 90 శాతం సబ్సిడీని శాచురేషన్ పద్ధతిలో అందించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కొండ ప్రాంతాల్లో సాగు చేసే గిరిజనులకు నీటి వనరుల సమస్యను అధిగమించి, అధిక దిగుబడులు సాధించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను 54 శాతానికి పెంచుకోవడం వల్లే ఇది సాధ్యమైందని మంత్రి వివరించారు.

**నీటి కాలుష్య నివారణ చట్టానికి ఆమోదం**

కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'నీటి కాలుష్య నివారణ, నియంత్రణ సవరణ చట్టం-2024'ను రాష్ట్రంలోనూ అమలు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ కొత్త చట్టం ప్రకారం, చిన్న చిన్న ఉల్లంఘనలకు

మిగతా 2లో

## ఏపీలో రూ.47 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత



**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్‌లో అక్రమ మాదకద్రవ్యాల తయారీపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) భారీ కొరడా ఝుళిపించింది. ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి పారిశ్రామిక వాడలో ఎన్‌డీపీఎస్ చట్టం-1985 పరిధిలోకి వచ్చే సైకోట్రోపిక్ పదార్థమైన అల్ప్రజోలంను రహస్యంగా తయారు చేస్తున్న ఓ ఫ్యాక్టరీ

మిగతా 2లో



## ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుడు

**పెన్ పవర్ డెస్క్:**ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుడు చోటుచేసుకుంది. పాలస్తీనాకు మద్దతుగా భారీ ఎత్తున నిర్వహిస్తున్న 'కుద్స్ డే' ర్యాలీలో ఊహించని విధంగా తీవ్ర విస్ఫోటనం సంభవించింది. ఇజ్రాయెల్ సైన్యం బహిరంగంగా హెచ్చరికలు జారీ చేసిన కొద్దిసేపటికే ఈ ఘటన జరగడం గమనార్హం. దాడికి ముందు ఇజ్రాయెల్ సైన్యం తమ అధికారిక పెర్షియన్ (ఫార్సీ) సోషల్ మీడియా ఖాతా ద్వారా మూడు మ్యాప్‌లను పంచుకుంది. టెహ్రాన్‌లోని చహర్రా-ఇ వెలియాస్ర్, మేయ్దాన్-ఇ తౌహిద్, విల్లాస్ ప్రాంతాలను ఎరుపు రంగుతో మార్క్ చేసింది. ఈ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు వెంటనే సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని, త్వరలోనే దాడులు జరుగుతాయని చాలా స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది. ఈ హెచ్చరికలు వెలువడిన కొద్ది సమయానికే, టెహ్రాన్ యూనివర్సిటీ వైపు వెళుతున్న కుద్స్ డే ర్యాలీ సమీపంలో

మిగతా 2లో

## ఎల్‌పీజీ కొరత.. గ్యాస్ గోడౌన్ల వద్ద బారులు

**పెన్ పవర్ డెస్క్:**ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఎల్పీజీ కొరత వినియోగదా రులను ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికే బెంగళూరు, ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ తదితర నగరాల్లో వాణిజ్య సిలిండర్ల కొరత కారణంగా హోటళ్లు, రెస్టారెంట్లు తాత్కాలికంగా మూత పడ్డాయి. వంట గ్యాస్ కొరత కారణంగా గృహ వినియోగదారులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంట గ్యాస్ ఇళ్ల వరకు రావడానికి రోజుల సమయం పడుతుండటంతో వినియోగదారులు వివిధ ప్రాంతాల్లో గ్యాస్ గోడౌన్ల వద్దకు వచ్చి క్యూ కడుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో,

మిగతా 2లో



## అమరావతిలో బిట్స్ పిలాని ఏఐ క్యాంపస్..

### ప్లాన్లను పరిశీలించిన మంత్రి నారా లోకేశ్




**పెన్ పవర్ డెస్క్:**ఏపీ రాజధాని అమరావతిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించతలపెట్టిన బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (BITS) పిలాని 'ఏఐ ప్లస్ క్యాంపస్' నిర్మాణ ప్లాన్లను రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నేడు పరిశీలించారు. ఉండవల్లిలోని నివాసంలో బిట్స్ ప్రతినిధులు సిద్ధార్థ బెనర్జీ, ఎన్.చెన్నవీర్, బీఎస్ సహాని మంత్రి నారా లోకేశ్ ను కలిసి క్యాంపస్ నిర్మాణ ప్రణాళికలను వివరించారు. నిర్మాణ ప్లాన్లను, డిజైన్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా బిట్స్ ప్రతినిధులు మాట్లాడుతూ, రెండు దశల్లో 7 వేల మంది విద్యార్థులకు విద్యనందించేలా ఈ క్యాంపస్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. రానున్న ఐదేళ్లలో దీనిపై రూ.1,000 కోట్ల

మిగతా 2లో

## ఏపీ ప్రభుత్వంపై మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించిన పేర్ని నాని



**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని ఈరోజు సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, శాంతిభద్రతలపై ఆయన పలు ప్రశ్నలు సంధించారు. హెరిటేజ్ సంస్థకు రాయితీలు ఇస్తున్నారంటూ మండిపడ్డారు.రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను 'అప్పుల మంత్రి'గా

మిగతా 2లో

## హిడ్మాను చిత్రహింసలకు గురి చేసి చంపేశారు



**పెన్ పవర్ డెస్క్:**మాజీ మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ (తిప్పిరి తిరుపతి) లొంగిపోయిన సంగతి తెలిసిందే. ఆయుధాలను వదిలేసి ఆయన జన జీవన స్రవంతిలో కలిసిపోయారు. ఆయన ఈరోజు ఒక మీడియా ప్రతినిధితో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. హిడ్మా లొంగిపోతానని చెప్పినప్పుడు తాము వారించామని, అయితే

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### భూమాత జీవనాడులు జీవనదులు

భూగ్రహ జీవనాడులగా జీవనదులు భూమాత ఉపరితలంపై నిరంతరం పారుతూనే ఉన్నాయి. నదులు ప్రవహించే జలాలు మాత్రమే కాదు, భూమండల గుండె సవ్వడులు. ఈ పుణ్య నదులు ధరణికే ప్రాణమిచ్చే వరాలు. పృథ్వీపై నెలకొన్న సహజ నదులు దేవుడిచ్చిన అపూర్వ వరప్రసాదాలు. జీవనదులు బిలియన్ల మానవాళికే కాదు సకల జీవకోటికి అవసరాలకు తాగు నీటిని, ఆహారాన్ని, జీవనోపాధులను కల్పిస్తున్నాయి. నదీ తీరాలు మానవ వికాస కేంద్రాలు, ఆవాస క్షేత్రాలు. ప్రపంచవ్యాప్త జీవవైవిధ్య పునరుద్ధరణతో పాటు సంరక్షణ భాధ్యతలను తీసుకుంటున్నాయి. సువిశాల భారత దేశ పుణ్య భూమిపై ప్రవహిస్తున్న గంగా, గోదారి, యమున, నర్మద, సింధు, మహానది, కావేరి లాంటి జీవనదులు దేవతలుగా పూజించబడుతున్నాయి. ఏ దేశంలోనైనా నదులు జీవకోటికి తాగు నీటిని ఇవ్వడమే కాకుండా వ్యవసాయం, పరిశ్రమలు, ఉపరితల రవాణా రంగాలకు ఊపిరిగా నిలుస్తున్నాయి. నీటి ప్రాధాన్యాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఇటీవల 'జల శక్తి మంత్రిత్వ శాఖను కూడా ఏర్పాటు చేసి పలు నదీ పరిరక్షణ చర్యలను తీసుకుంటున్నాయి. గత ఐదు దశాబ్దాలుగా మంచి నీటి వనరుల్లో జీవించే జీవరాశుల్లో దాదాపు 83 శాతం వరకు కనుమరుగా అయ్యాయని తెలుస్తున్నది. నేటి డిజిటల్ యుగంలో మారుతున్న జీవనశైలి, జీవన విలువల నడుమ నదుల పరిరక్షణ యజ్ఞానికి అనేక అవాంతరాలు ఎదురవుతున్నాయి. నదీ జలాల కాలుష్యం, పారిశ్రామిక వ్యర్థాల తల నొప్పి, నదీ జలాల దుర్వినియోగం, అర్థరహిత డ్యామ్‌ల నిర్మాణం, జలాల అక్రమ తరలింపు, వాతావరణ ప్రతికూల మార్పులు, స్వార్థానికి నదీమతల్లిని వెన్నుపోటు పొడవడం, అక్రమ మైనింగ్, అడవుల నరికివేత, ఆహార అభద్రత, ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం, నదీ జలాల పరిరక్షణ చట్టాల ఉల్లంఘనలు లాంటి కార్యకలాపాలతో నదులు పలుచబడడం లేదా నదీ జలాలు గరళ కేంద్రాలుగా మారడం కొనసాగుతున్నది. నదీ జలాల పరిరక్షణ, పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేయడానికి ప్రజా చైతన్య కార్యక్రమాల నిర్వహణకు 1997 నుంచి ప్రతి ఏట 14 మార్చిన ప్రపంచవ్యాప్తంగా "అంతర్జాతీయ నదుల పరిరక్షణ చర్యల దినం" లేదా "ఇంటర్నేషనల్ డే ఆఫ్ ఆక్షన్ ఫర్ రివర్స్" వేడుకలను నిర్వహించడం జరుగుతున్నది. 2026 అంతర్జాతీయ నదుల పరిరక్షణ చర్యల దినం ఇతివృత్తంగా "మన నదులు, మన భవిష్యత్తు" అనబడే అంశాన్ని గత కొన్ని సంవత్సరాలకు నిర్ణయించి ప్రచారం నిర్వహించుట జరుగుతోంది. నీటి కాలుష్య కట్టడి, నీటిని వ్యాపారంగా మార్చే ప్రైవేట్ రంగాల రెక్కలు విరవడం, నదీ జలాల దుర్వినియోగాలను అరికట్టడం, వ్యర్థాలను నదుల్లో కలుగకుండా అడ్డుకట్ట వేయడం, శుద్ధ జలాల సంరక్షణ, నదీ తీరాల దురాక్రమణలను వ్యతిరేకించడం, వాటర్ షెడ్ నిర్మాణాలు చేపట్టడం, నదుల జీవ వైవిధ్యాలను కాపాడడం లాంటి చర్యలు తీసుకోవడం ద్వారా నదుల పునరుద్ధరణ జరిగి పూర్వపు శుద్ధ జలాలు తిరిగి జర జరా వాగులై, ఏరులై, నదులై పల్లపు ప్రదేశాల వైపు నవ్వుతూ ప్రవహిస్తాయి. భూమిని ఒక పవిత్ర సహజ పుట్టినిల్లుగా చూసుకోవడం మనందరి కనీస కర్తవ్యం. నదుల పరిరక్షణతో సుస్థిరాభివృద్ధి ముడిపడి ఉంటుంది. ప్రపంచ మానవాళి ఐక్యతతో మానవ హారం పడితేనే నదుల పునర్వైభవం సుసాధ్యం అవుతుంది. నదుల పరిరక్షణ అంటే మానవాళినా మనుగడను కాపాడుకోవడమే అని భావించాలి. కాలుష్య నదీ జలాలు మానవ, జీవకోటి ఉనికికే పెను ప్రమాదాలని గుర్తుంచుకోవాలి. అంతర్జాతీయ నదుల పరిరక్షణ చర్యల దినం వేదికగా నదీ జలాల శుద్ధి, అక్రమ డ్యామ్‌ల నిర్మాణాలను వ్యతిరేకించడం, విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు, నదుల అంశంలో పోటీల నిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు లాంటివి పెద్ద ఎత్తున నిర్వహించి రాబోయే తరానికి సరైన తాగు నీటి వనరులను అమూల్య బహుమతులుగా అందిద్దాం, నదీమతల్లులకు నిత్యం ప్రణమిల్లుదాం.

# ముగిసిన ఏపీ క్యాబినెట్ భేటీ...

- మొదటి పేజి తరువాయి

విధించే జైలు శిక్షలను తొలగించి, వాటి స్థానంలో జరిమానాలు మాత్రమే విధిస్తారు. ఈ చట్టాన్ని ఆమోదించడం ద్వారా రాష్ట్రంలోని కాలుష్య నగరాలకు 'నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం' కింద కేంద్రం నుంచి నిధులు పొందేందుకు, పరిశ్రమలపై ఫీజుల భారం తగ్గించుకునేందుకు వీలు కలుగుతుంది.

**ఉద్యోగినుల కోసం 'సఖీ నివాస్' హాస్టళ్లు**

మిషన్ శక్తి పథకం కింద రాష్ట్రంలో ఉద్యోగాలు చేసే మహిళల కోసం 'సఖీ నివాస్' పేరుతో 30 వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. సురక్షితమైన వసతితో పాటు, చిన్న పిల్లలున్న తల్లుల సౌకర్యార్థం ఈ హాస్టళ్లలో క్రెష్ (శిశు సంరక్షణ కేంద్రం) సదుపాయాన్ని కూడా కల్పిస్తారు. ఉద్యోగినులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో హాస్టల్ నిర్వహణకు 8 మంది సిబ్బందిని అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమిస్తారు.

**వ్యాపారులకు జీఎస్టీ ట్రైబ్యునల్స్**

జీఎస్టీ సంబంధిత వివాదాల పరిష్కారాన్ని సులభతరం చేసేందుకు, వ్యాపారులకు సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం అన్ని అప్పీళ్లను విజయవాడలోనే విచారిస్తుండటంతో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీన్ని నివారించేందుకు విశాఖపట్నం, తిరుపతి, విజయవాడలలో మూడు అప్పిలేట్ ట్రైబ్యునల్ కార్యాలయాలను నోటిఫై చేసేందుకు కేబినెట్ ఆమోదించింది. దీనివల్ల కేసులు త్వరగా పరిష్కారమై రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం కూడా సకాలంలో అందుతుంది.

**జల జీవన్ మిషన్‌కు భారీగా నిధులు**

ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన జల జీవన్ మిషన్ (జేజేఎమ్) పథకం గడువు ముగిసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ చొరవతో కేంద్రం దానిని 2028 వరకు పొడిగించింది. ఈ నేపథ్యంలో, వివిధ పథకాల కింద నిధులు సమకూర్చుకుని రూ.9,355 కోట్ల విలువైన ఏడు భారీ ప్రాజెక్టులకు మంత్రివర్గం పరిపాలన ఆమోదం తెలిపింది. అలాగే, తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న 3000 నివాస ప్రాంతాలకు రూ.1,814.71 కోట్లతో తాగునీటి పనులు చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టుల ద్వారా 76 మండలాల్లోని 65 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది.

**కొత్తగా కేంద్రీయ విద్యాలయాలు**

రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ఊతమిస్తూ మూడు కొత్త కేంద్రీయ విద్యాలయాల (కేవీ) ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం రాఘవాపురంలో 5 ఎకరాలు, ఏలూరు జిల్లా నూజివీడులో 7 ఎకరాలు, శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పురుషోత్తపురంలో 5 ఎకరాల చొప్పున భూమిని కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌కు కేటాయించారు. బదిలీలపై వచ్చే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలతో పాటు స్థానిక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం దీని ముఖ్య ఉద్దేశం.

**పోలవరం పనుల వేగవంతానికి ఆమోదం**

రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు పనులను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. కాంట్రాక్ట్ గడువు జూన్ 2027 వరకు ఉన్నప్పటికీ, పనులను త్వరగా పూర్తి చేసే లక్ష్యంతో మూడో గ్యాంట్రీ క్రేన్‌ను ఏర్పాటు చేసేందుకు అంగీకరించింది. ప్రాజెక్టులో లైనింగ్ పనులతో పాటు, సుదీర్ఘకాలం పనులు నిలిచిపోవడం వల్ల దెబ్బతిన్న రాతి పొరల వద్ద భద్రతా చర్యలు చేపట్టనున్నారు. ఈ అదనపు పనుల కోసం ప్యాకేజీ-63ఏ కు రూ.23.47 కోట్లు, ప్యాకేజీ-64ఏ కు రూ.24.51 కోట్ల అదనపు వ్యయానికి కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి పార్థసారథి వివరించారు.

# ఏపీలో రూ.47 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత

- మొదటి పేజి తరువాయి

గుట్టు రట్టు చేసింది. 'ఆపరేషన్ వైట్ హ్యామర్' అనే కోడ్‌నేమ్‌తో మార్చి 11, 12 తేదీల్లో నిర్వహించిన ఈ మెరుపు దాడుల్లో సుమారు రూ.47 కోట్ల విలువైన 237 కిలోల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుని, ఇద్దరు కీలక నిందితులను అరెస్ట్ చేసింది.

పక్కా ఇంటెలిజెన్స్ సమాచారంతో డీఆర్ఐ అధికారులు ఈ ఆపరేషన్ చేపట్టారు. రసాయనాల తయారీ యూనిట్ ముసుగులో పూర్తిస్థాయి పారిశ్రామిక వసతులతో అల్ప్రజోలం తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఫ్యాక్టరీ ప్రాంగణంలో జరిపిన సోదాల్లో రూ.47 కోట్ల విలువైన 237 కిలోల అల్ప్రజోలంతో పాటు, 800 కిలోలకు పైగా కీలక ముడి పదార్థాలు, 2,860 లీటర్ల వివిధ రసాయనాలు స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు రియాక్టర్లు, డ్రైయర్లు, సెంట్రిఫ్యూజ్ వంటి భారీ పారిశ్రామిక పరికరాలను సీజ్ చేసినట్లు డీఆర్ఐ ఓ ప్రకటనలో తెలిపింది. ఇది వ్యవస్థీకృతంగా, పెద్ద ఎత్తున జరుగుతున్న అక్రమ తయారీ కేంద్రమని అధికారులు నిర్ధారించారు. ప్రాథమిక విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. రసాయన, ఫార్మా రంగంలో 20 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న ఓ కెమిస్ట్ ఈ అక్రమ దందాకు సూత్రధారిగా వ్యవహరించినట్లు తేలింది. అతడికి మరో వ్యక్తి సహకరిస్తూ హైదరాబాద్‌లో ముడి పదార్థాల సేకరణ, తయారైన డ్రగ్స్ పంపిణీ బాధ్యతలను

చూసుకునేవాడు. వీరిద్దరూ అల్ప్రజోలం అక్రమ తయారీ కోసమే ఈ ఫ్యాక్టరీని అద్దెకు తీసుకున్నారని అధికారులు గుర్తించారు. ప్రస్తుతం ఈ ఇద్దరు సూత్రధారులను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా డీఆర్ఐ తన నిఘాను పటిష్ఠం చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా ఎనిమిది రహస్య డ్రగ్ తయారీ కేంద్రాలను ఛేదించినట్లు అధికారులు తెలిపారు. మాదకద్రవ్యాల ముప్పు నుంచి సమాజాన్ని కాపాడేందుకు కట్టుబడి ఉన్నామని డీఆర్ఐ పునరుద్ఘాటించింది.

# అమరావతిలో బిట్స్ పిలాని ఏఐ క్యాంపస్..

- మొదటి పేజి తరువాయి

పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించారు. దేశంలోనే తొలి ఏఐ క్యాంపస్‌గా దీనిని తీర్చిదిద్దుతున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతకు అనుగుణంగా అత్యాధునిక టెక్నాలజీతో దీనిని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. క్యాంపస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, రోబోటిక్స్ వంటి కోర్సులతో పాటు వ్యవసాయం, వాతావరణం, ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన కోర్సులను కూడా ప్రవేశపెట్టనున్నట్లు వివరించారు. పర్యావరణహితంగా గ్రీన్ బిల్డింగ్, పునరుత్పాదక ఇంధన విధానాలతో నిర్మాణం చేపడుతున్నామని, పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్లాన్లను పరిశీలించిన మంత్రి లోకేశ్ సంతృప్తి వ్యక్తం చేశారు. క్యాంపస్ నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రారంభించాలని వారికి సూచించారు.

# హిడ్మాను చిత్రహింసలకు గురి చేసి చంపేశారు

- మొదటి పేజి తరువాయి

పోలీసుల ట్రాప్‌లో పడి ఆయన ప్రాణాలు కోల్పోయారని దేవ్‌జీ అన్నారు. హిడ్మాది వంద శాతం బూటకపు ఎన్‌కౌంటర్ అని, ఆయనను చిత్రహింసలకు గురిచేసి చంపేశారని ఆయన ఆరోపించారు. 'ఆపరేషన్ కగార్' సమయంలో బస్వరాజు చేసిన విజ్ఞప్తిని కేంద్రం పట్టించుకోకపోవడం వల్లే ప్రతిఘటన అనివార్యమైందని, ఆ పోరాటంలోనే బస్వరాజును కోల్పోయామని వెల్లడించారు. మరోవైపు, అగ్రనేత గణపతి గురించి స్పందిస్తూ.. 2023లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో ఆయనను చివరిసారిగా చూశానని, ఆ తర్వాత ఆయనతో సంబంధాలు లేవని దేవ్‌జీ స్పష్టం చేశారు. సమాజంలో దోపిడీ రూపం మార్చుకుందే తప్ప తొలగిపోలేదని... దోపిడీ ఉన్నంత కాలం ఉద్యమం కొనసాగుతుందని ఆయన వ్యాఖ్యానించారు. మావోయిస్టు పార్టీపై నిషేధాన్ని ఎత్తివేసి, జైళ్లలో ఉన్న వారిని రాజకీయ ఖైదీలుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాజకీయ పదవుల కోసం తాను ఎన్నికల్లో పోటీ చేయబోనని, చట్టం పరిధిలోనే ఉండి ప్రజా సమస్యలపై పోరాడతానని దేవ్‌జీ ప్రకటించారు.

# వారిని అంతం చేస్తున్నా

- మొదటి పేజి తరువాయి

హెచ్చరించారు. క్షిపణులు, డ్రోన్లు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయని ఆయన అన్నారు.

ఇప్పటికే వారి నాయకులు తుడిచిపెట్టుకుపోయారని అన్నారు. అక్కడి పాలకులు 47 ఏళ్ళుగా అమాయకులను పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. అందుకే అగ్రరాజ్యం అధ్యక్షుడిగా వారి అంతు చూస్తున్నానని ట్రంప్ అన్నారు. ఇదిలా ఉండగా, అమెరికాకు చెందిన రీఫ్యూయలింగ్ విమానం కేసీ-135 ట్యాంకర్ ఉత్తర ఇరాక్‌లో కుప్పకూలింది. ఈ ఘటనలో నలుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం సమయంలో విమానంలో ఆరుగురు ఉన్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, ఘటనకు దారి తీసిన చర్యలపై దర్యాప్తు చేస్తున్నామని అమెరికా మిలిటరీ సెంట్రల్ కమాండ్ తెలిపింది.

# ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్‌జే దొర కన్నుమూత

- మొదటి పేజి తరువాయి

చేయించుకుని ఇంటికి వెళ్లారు. ఆ తర్వాత ఆయన బాత్రూంలో పడిపోయినట్టు తెలుస్తోంది. హెచ్‌జే దొర తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు నిమ్స్ కు తరలించారు. అత్యవసర చికిత్స అందించినప్పటికీ డాక్టర్ల ప్రయత్నాలు ఫలించలేదు. 1965 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన హెచ్‌జే దొర శ్రీకాకుళం జిల్లాకు చెందినవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డీజీపీగా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ఆయన విశేష సేవలు అందించారు. ముఖ్యంగా, రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాదాన్ని (నక్సలిజం) అణచివేయడంలో కీలక పాత్ర పోషించి గుర్తింపు పొందారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్‌గా,

సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్‌గానూ జాతీయ స్థాయిలో పలు ఉన్నత పదవులు చేపట్టారు. దొర 1996లో డీజీపీగా ప్రమోషన్ పొందారు. ఆయన తన సుదీర్ఘ వృత్తి జీవితానుభవాలతో 'జర్నీ త్రూ టర్బ్యులెంట్ టైమ్స్' పేరుతో ఆత్మకథను కూడా రచించారు.

# ఎల్‌పీజీ కొరత.. గ్యాస్ గోడౌన్ల వద్ద బారులు

- మొదటి పేజి తరువాయి

జనగాం జిల్లా రఘునాథపల్లిలో వంట గ్యాస్ కోసం ప్రజలు సిలిండర్లతో బారులు తీరారు. మూడు రోజుల క్రితం గ్యాస్ బుక్ చేసుకున్నప్పటికీ రాలేదని వరుసలో నిలబడిన వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# పిఠాపురంలో ఫ్లెక్సీ చిచ్చు...

- మొదటి పేజి తరువాయి

టీడీపీ నాయకులపై వర్మ మండిపడ్డారు. ముఖ్యమంత్రి ఫొటో గురించి ముందే చూసుకోవాలి కదా... పార్టీలో ఉంటూ ఏం చేస్తున్నారు? అంటూ ఆగ్రహం వెలిబుచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న నాయకుడి ఫొటో రెవెన్యూ స్టాంప్ అంత చిన్నదిగా వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని పార్టీలకు అతీతంగా అందరూ గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. మొన్న సంక్రాంతి సంబరాల్లోనూ ఇలాగే జరిగిందని అన్నారు. దాదాపు ఐదారుసార్లు ఇటువంటి పరిణామాలు చోటుచేసుకున్నాయని తెలిపారు. ఇవాళ పారిశుద్ధ్య కార్మికుల శిక్షణ కార్యక్రమంలో తాను వేదిక ఎక్కినా, కార్యకర్తలు ఊరుకోలేదని వర్మ వెల్లడించారు.

# బడి భోజనంలో తేడాలొస్తే కఠిన చర్యలు

- మొదటి పేజి తరువాయి

జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పథకం అమలులో పారదర్శకత, నాణ్యత పెంచేందుకు మంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. భోజనం సిద్ధమయ్యాక, విద్యార్థులకు వడ్డించడానికి ముందుగా ప్రతిరోజూ ఒక టీచర్ తప్పనిసరిగా రుచి చూడాలని, నాణ్యతను నిర్ధారించాలని స్పష్టం చేశారు. పథకంలో సమూల మార్పుల కోసం, రాష్ట్రవ్యాప్తంగా యుద్ధ ప్రాతిపదికన సెంట్రలైజ్డ్ కిచెన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచేందుకు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. వారానికి ఒకరోజు స్థానిక ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గంలోని ఏదో ఒక పాఠశాలను సందర్శించి, పిల్లలతో కలిసి భోజనం చేయాలని కోరారు. దీనివల్ల లోటుపాట్లుంటే వెంటనే సరిదిద్దుకోవడానికి వీలవుతుందని అభిప్రాయపడ్డారు. భోజనం నాణ్యతపై తల్లిదండ్రులు తమ అభిప్రాయాలను, ఫిర్యాదులను నేరుగా 'లీప్' యాప్ ద్వారా తెలియజేయవచ్చని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. వ్యక్తిగత లేదా రాజకీయ ప్రయోజనాల కోసం పథకంపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుడు

- మొదటి పేజి తరువాయి

పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. పవిత్ర రంజాన్ మాసం చివరి శుక్రవారం సందర్భంగా పాలస్తీనాతో సంఘీభావం తెలుపుతూ ఇరాన్ ప్రజలు ఈ నిరసనలు చేపడుతుంటారు. పేలుడు దెబ్బకు ఆకాశంలోకి దట్టమైన పొగలు ఎగిసిపడటంతో జనం ప్రాణభయంతో పరుగులు తీశారు.

ప్రస్తుతం ఈ ఘటనలో ఎంతమంది ప్రాణాలు కోల్పోయారు, ఎంతమంది గాయపడ్డారు అనే దానిపై ఇరాన్ ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. సంఘటనా స్థలంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న తరుణంలో.. ఇజ్రాయెల్ ముందస్తు హెచ్చరికలు చేసిన వెంటనే ఈ పేలుడు జరగడం పశ్చిమాసియాలో మరింత ఆందోళనను రేకెత్తిస్తోంది.

# ఏపీ ప్రభుత్వంపై మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించిన పేర్ని నాని

- మొదటి పేజి తరువాయి

అభివర్ణించిన పేర్ని నాని, ప్రభుత్వం అప్పుల విషయంలో పచ్చి అబద్ధాలు చెబుతోందని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ పక్కా ఆధారాలతో నిజాలు మాట్లాడారని, వాటిని అబద్ధమని నిరూపించే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని సవాల్ చేశారు. ఇప్పటికే ప్రభుత్వం రూ. 3.27 లక్షల కోట్ల అప్పు చేసినట్లు జీవోలు ఉన్నాయని, కానీ అప్పులు కేవలం లక్ష కోట్లేనని తప్పుడు లెక్కలు చెబుతున్నారని మండిపడ్డారు. ఈ లెక్కలపై వారం రోజుల్లోగా స్పష్టత ఇవ్వాలని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిని డిమాండ్ చేశారు. తప్పుడు లెక్కలపై కేంద్రానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

రాష్ట్రంలో మహిళలపై అకృత్యాలు పెరుగుతున్నాయని, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మహిళను వేధిస్తే చర్యలు తీసుకోకపోగా, తిరిగి ఆమెపైనే కేసులు పెట్టడం దుర్మార్గమని విమర్శించారు. మహిళలను వేధిస్తే అదే వారికి చివరి రోజు అన్న చంద్రబాబు మాటలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. అలాగే హాస్టళ్లలో పిల్లలకు సరైన భోజనం అందడం లేదని, మైలవరం స్కూల్ ఘటనలే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ ప్రత్యేక విమానాల్లో విదేశాలకు వెళ్లి క్రికెట్ చూస్తున్నారని, ఆయనకు విద్యార్థుల కష్టాలు పట్టడం లేదని అన్నారు. హెరిటేజ్ సంస్థ అప్‌గ్రేడ్ కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలంట అంటూ ధ్వజమెత్తారు. కరెంటు బిల్లుల్లో కూడా రాయితీలు కల్పిస్తున్నారని పేర్ని నాని ఆరోపించారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు నియామకంపై కూడా ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అక్రమ సంబంధాల ఆరోపణలు ఉన్న వ్యక్తికి పవిత్రమైన టీటీడీ పదవి ఎలా ఇస్తారని నిలదీశారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# సోలార్ విద్యుత్ పెన్సింగ్‌తో గిరిజన రైతులకు అధిక లాభాలు

## సదుపాయం కల్పించేలా చర్యలు ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి



**రంపచోడవరం, పెన్ పవర్, మార్చి 13 :**గిరిజన రైతులకు సోలార్ విద్యుత్ పెన్సింగ్ సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకుంటామని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి తెలిపారు. శుక్రవారం రంపచోడవరం మండలం పందిరిమామిడి గ్రామంలో గిరిజన రైతు పండా చెల్లన్న దొర పొలంలో ఏర్పాటు చేస్తున్న సోలార్ పెన్సింగ్ విధానాన్ని ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ల బొజ్జి రెడ్డి, సంయుక్త కలెక్టర్ మరియు ఐటిడిఎ పీఓ బచ్చు స్మరణ రాజు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో వ్యవసాయానికి కోతుల సమస్య పెద్ద ఆటంకంగా మారిందని రైతులు తమకు విన్నవించుకున్నట్లు చెప్పారు. కోతుల వల్ల పంటలకు తీవ్ర నష్టం జరుగుతోందని, దీనివల్ల రైతులు వ్యవసాయం చేయడంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యను తగ్గించేందుకు సోలార్ పెన్సింగ్ వంటి చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ పీఓ బచ్చు స్మరణ రాజును సూచించారు.అలాగే గ్రామంలో ఉన్న చెక్‌డ్యాం మరమ్మతులు చేయాలని రైతులు కోరగా వెంటనే స్పందించిన సంయుక్త కలెక్టర్ మరియు ఐటిడిఎ పీఓ స్మరణ రాజు త్వరలోనే మరమ్మతులు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు గొర్లె సునీత, రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సుభానీ, రంపచోడవరం మండల పార్టీ అధ్యక్షుడు పెంటపాటి అనంత మోహన్, ఏఎంసీ వైస్ చైర్మన్ సలాది బాపిరాజు, సీతపల్లి గుడి దేవస్థానం చైర్మన్ కుంజం బాపన్నదొర, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు అడబాల బాపిరాజు, కార్యదర్శి కోసు నాగన్న దొర, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఈరోజు స్వప్న కుమారి, మారేడుమిల్లి మండల పార్టీ అధ్యక్షుడు గురుకు శేషుకుమార్, జనసేన నాయకులు పాపోలు శ్రీనివాసరావు, గంగవరం మండల పార్టీ అధ్యక్షుడు పల్లాల వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలోపలువురు రైతులు, ఉద్యానవన శాఖ సిబ్బంది, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# శాప్ ఆధ్వర్యంలోగిరిజన క్రీడా కారుల ఎంపికలు



**వై రామవరం, పెన్ పవర్, మార్చ్ 13:** మండలంలో శాప్ ఆధ్వర్యంలో అండర్ 14 సంవత్సరముల లోపు గిరిజన బాల బాలికలకు క్రీడలలో ఎంపిక నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో కే.బాపన్న దొర తెలిపారు.

ఆర్చరీ, అథ్లెటిక్స్, వెయిట్ లిఫ్టింగ్, హాకీ,ఖో ఖో, ఫుట్బాల్,బాక్సింగ్ క్రీడలలో ఎంపికలు రంపచోడవరం ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఈనెల 16,17 తేదీలలో ఎంపికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. క్రీడా ఎంపికలకు హాజరయ్యే విద్యార్థులు కచ్చితంగా బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్,కాస్ట్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్,నాలుగు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, ఫిజికల్ ఫిట్నెస్ సర్టిఫికెట్ లతో హాజరుకావాలని తెలిపారు.

# మండలానికి అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన నిధులు విడుదల

Constituency wise ADSB-PM KISAN installment amount release Statement on 13.03.2026 in Polavaram District

| S No | Constituency | Mandal | No of farmer families | ADSB 3rd installment @ Rs.4000/- Amount (in crores) | PMKISAN 22nd installment @ Rs.2000/- Amount (in crores) | Total Amount (in Crores) |
|---|---|---|---|---|---|---|
| 1 | Rampachodavaram | ADDATEEGALA | 5381 | 2.15 | 1.08 | 3.23 |
| 2 | | CHINTOOR | 2807 | 1.12 | 0.56 | 1.68 |
| 3 | | DEVIPATNAM | 2729 | 1.09 | 0.55 | 1.64 |
| 4 | | GANGAVARAM | 4161 | 1.66 | 0.93 | 2.60 |
| 5 | | KUNAVARAM | 1501 | 0.60 | 0.30 | 0.90 |
| 6 | | MAREDUMILLI | 3496 | 1.40 | 0.70 | 2.10 |
| 7 | | NELLIPAKA | 3022 | 1.21 | 0.63 | 1.84 |
| 8 | | RAJAVOMMANGI | 5490 | 2.20 | 1.10 | 3.29 |
| 9 | | RAMPACHODAVARA | 5913 | 2.37 | 1.18 | 3.55 |
| 10 | | VR PURAM | 652 | 0.26 | 0.23 | 0.49 |
| 11 | | Y. RAMAVARAM | 3383 | 1.35 | 0.76 | 2.11 |
| 12 | | GURTEDU | 1823 | 0.73 | 0.40 | 1.13 |
| | | Polavaram District total | 40358 | 16.14 | 8.42 | 24.56 |

**వై రామ వరం, పెన్ పవర్, మార్చి 13:** మండలంలో ఉన్న రైతుల ఖాతాలలో పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధులు జమ అయ్యాయని అగ్రికల్చరల్ ఆఫీసర్ సుజాత తెలిపారు.

వై రామవరం మండలంలో 3,383 మంది రైతులు ఖాతాలలో జమ అయ్యాయని తెలిపారు. అదేవిధంగా గుర్తేడు మండలానికి 1823 మంది రైతులకు1.13 కోట్లు జమ అయ్యాయని తెలిపారు. ఖాతాలలో 2.11 కోట్లు రూపాయలు జమ అయ్యా యని తెలిపారు. ఇందులో అన్నదాత సుఖీభవ మూడవ వాయిదా 1.5 కోట్లు, పీఎం కిసాన్ యోజన ద్వారా 22 వాయిదా రైతులు ఖాతాలలో 0.71 కోట్ల రూపాయలు

# దివాన్ చెరువు పరిసర ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి రూ.1.27 కోట్ల ప్రతిపాదనలు

- కమీషనర్ రాహుల్ మీనా తో ఎమ్మెల్యే బత్తుల భేటీ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 13**
రాజానగరం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న పౌర సమస్యలను , దివాన్ చెరువు గ్రామపంచాయతీ పరిధిలో చర్యలు తీసుకోవాలని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ శుక్రవారం మునిసిపల్ కార్పోరేషన్ కమీషనర్ రాహుల్ మీనా ని కోరారు. నియోజకవర్గంలోని రూప్‌నగర్ , శ్రీరాంపురం గ్రామపంచాయతీలలో పరిపాలనా నిర్వహణ సమస్యల కారణంగా ప్రాథమిక పౌర సేవలు పెండింగ్ లో ఉన్నాయని వివరించారు , దివాన్ చెరువు పంచాయతీ లో పారిశుద్ధ్యం సమస్యగా మారిందని, పచ్చదనం తగ్గిపోవడంతోపాటు, ప్రజారోగ్య సమస్యలు పెరుగుతున్నాయని బత్తుల తెలిపారు. నీటి పైపులలో లీకేజీలు, పనిచేయని బోర్‌వెల్స్ వాటర్ ట్యాంకర్లు, పాడైన వీధి దీపాలు, గుంతలతో నిండిన రహదారులు, మురుగు కాలువలలో మట్టి పేరుకుపోవడం సమస్యలు ఉన్నట్లు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలో పారిశుధ్య ట్రాక్టర్లు ట్రైలర్ల మరమ్మతులు, పారిశుద్ధ్య పరికరాల కొనుగోలు, వీధి దీపాల స్పేర్ పార్ట్స్ సరఫరా, నీటి ట్యాంకుల మోటార్ల మరమ్మతులు, పైపులైన్లు గేట్ వాల్వుల మరమ్మతులు, రూప్‌నగర్‌లో కొత్త పైపులైన్ ఏర్పాటు, కాలువల డీసిల్టింగ్, శ్రీరాంపురం ప్రాంతంలో నీటి ట్యాంక్ మరమ్మతులు,నేషనల్ హైవే విస్తరణ లో దెబ్బతిన్న నీటి పైపులైన్ స్థానంలో కొత్త ది నిర్మాణం పనులను చేపట్టాల్సిన అవసరం ఉందని కమీషనర్ దృష్టికి ఆయన తీసుకుని వచ్చారు.

శ్రీరామపురం గ్రామంలో ఎర్ర చెరువును రూ. 49 లక్షలతో అభివృద్ధి చేయాలనీ కోరారు. చెరువు గట్టును నిర్మించి బలపరచుట వాకింగ్ ట్రాక్ నిర్మించాలన్నారు. సోలార్ లైట్స్ ఏర్పాటు చేయాలని, వ్యాయమ శాల నిర్మించాలని, చెరువు ముఖ ద్వారం ఏర్పాటు చేయాలన్నారు. ఈ పనుల మొత్తం అంచనా వ్యయం రూ.1.27 కోట్లు అవసరమని పేర్కొన్నారు.ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పై పనులకు త్వరితగతిన పరిపాలనా అనుమతి మంజూరు చేసి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత

# డా. వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో అంతర్ కళాశాల ఘనంగా క్రీడా పోటీలు ప్రారంభం.







**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 13:** డా. వై.ఎస్.ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 12వ అంతర్ కళాశాల క్రీడా మరియు క్రీడా పోటీలు శుక్రవారం ఉదయం వెంకటరామన్నగూడెంలోని ఉద్యాన కళాశాలలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడా మహోత్సవానికి ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ (సాప్) చైర్‌పర్సన్ శ్రీ ఎ. రవి నాయుడు ముఖ్య అతిథిగా హాజరై క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి శ్రీ ఎ. రవి నాయుడు మాట్లాడుతూ యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడానికి క్రీడలు ఎంతో అవసరమని అన్నారు. క్రీడలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ మరియు జట్టు భావనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించడానికి అనేక కార్యక్రమాలు చేపడుతోందని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచాలని సూచించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ ఉపకులపతి డా. కె. ధనుంజయ రావు మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో క్రీడలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వం పెరుగుతుందని తెలిపారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొని విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ క్రీడా పోటీల్లో విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న ఎనిమిది కళాశాలల నుంచి సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. అథ్లెటిక్స్ సహా 25కు పైగా ట్రాక్ మరియు ఫీల్డ్ ఈవెంట్లు మూడు రోజులపాటు నిర్వహించనున్నారు.

ఈ కార్యక్రమంలో డీన్ అఫ్ స్టూడెంట్ అఫైర్స్ డా. సి. మధుమతి, డీన్ అఫ్ హార్టికల్చర్ డా. బి. ప్రసన్న కుమార్, డీన్ పీజీ స్టడీస్ డా. ఎస్. సూర్య కుమారి, కంట్రోలర్ అఫ్ ఎక్సమినేషన్స్ డా. ఎస్ ఎస్ విజయ పద్మ, డైరెక్టర్ అఫ్ రీసెర్చ్ డా. జీ రామానందం, రిజిస్ట్రార్ డా. ఎం. మాధవి, డైరెక్టర్ నగర్ ఇండస్ట్రీస్ అండ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ డా. సి. రూత్, ఎస్టేట్ ఆఫీసర్ పీ. వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు .

ఈ క్రీడా పోటీలు మార్చి 15 వరకు కొనసాగనున్నాయి. విద్యార్థుల ఉత్సాహం, క్రీడాస్ఫూర్తి మధ్య పోటీలు సాగనున్నట్లు ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ మరియు నిర్వాహక కార్యదర్శి డా. ఎన్.బి.వి. చలపతి రావు పేర్కొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# బలుసులమ్మ సేవలో బాపిరాజు.



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 13:**తాడేపల్లిగూడెం గ్రామదేవత శ్రీ శ్రీ శ్రీ బలుసులమ్మ వారి జాతర మహోత్సవంలో పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు పాల్గొన్నారు.శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తో కలిసి శుక్రవారం ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాపిరాజు మాట్లాడుతూ బలుసులమ్మ తల్లి ఆశీస్సులతో తాడేపల్లిగూడెం ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ ఈ జాతర మహోత్సవాలను అపూర్వ రీతిలో అత్యంత వైభవంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. జాతర సందర్భంగా తాడేపల్లిగూడెంలో పండుగ వాతావరణం నెలకొందని అన్నారు. అమ్మ వారి ఆశీస్సులతో తాడేపల్లిగూడెం అని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలని అన్నారు.ఈ సందర్భంగా ఆయన ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## సచివాలయం సిబ్బందికి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి: డిప్యూటీ ఎంపీడీవో గోపన్నదొర





**గంగవరం, పెన్ పవర్, మార్చి 13 :**గంగవరం మండలంలోని స్వర్ణ లక్కొండ గ్రామాన్ని మండల స్వర్ణ అధికారి, డిప్యూటీ ఎంపీడీవో గోపన్నదొర శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందితో సమావేశమై బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను 100 శాతం పూర్తి చేసి, పనిదినాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.అనంతరం గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, విద్యా కార్యక్రమాలను పరిశీలించారు. పిల్లలకు పరిశుభ్రత అలవాట్లు పెంపొందించేందుకు హ్యాండ్‌వాష్ ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.ఇక ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామ ప్రజలకు ఆరోగ్యంపై జాగ్రత్తలు, పరిశుభ్రత అవసరం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడి సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో రైతుల ఖాతాల్లో రూ.75.66 కోట్లు జమ

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 13** :అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకాల అమలు కోసం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ యోజన పథకాల కింద ఆర్థిక సహాయం రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయిందని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి శుక్రవారం తెలిపారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం రైతుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేసారన్నారు. ఆయా నియోజక వర్గాల పరిధిలో స్థానిక శాసన సభ్యుల సమక్షంలో , రైతు సేవా కేంద్రాల స్థాయిలో నిధులు విడుదల చేసినట్లు తెలిపారు.

అనపర్తి నియోజకవర్గంలో అనపర్తి మండలంలో 3,342 మంది రైతులకు రూ.1.34 కోట్లు, బిక్కవోలు మండలంలో 5,932 మంది రైతులకు రూ.2.37 కోట్లు, రంగంపేట మండలంలో 8,321 మంది రైతులకు రూ.3.33 కోట్లు చొప్పున మొత్తం 17,595 మంది రైతులకు రూ.7.04 కోట్లు జమయ్యాయన్నారు . పీఎం కిసాన్ యోజన కింద అనపర్తి మండలంలో 3,289 మంది రైతులకు రూ.0.66 కోట్లు, బిక్కవోలు మండలంలో 5,218 మంది రైతులకు రూ.1.04 కోట్లు, రంగంపేట మండలంలో 6,714 మంది రైతులకు రూ.1.34 కోట్లు చొప్పున మొత్తం 15,221 మంది రైతులకు రూ.3.04 కోట్లు జమ చేశారు. రాజమహేంద్రవరం (రూరల్) నియోజకవర్గంలో కడియం మండలంలో 4,392 మంది రైతులకు రూ.1.76 కోట్లు పీఎం కిసాన్ యోజన కింద 3,846 మంది రైతులకు రూ.0.77 కోట్లు జమయ్యాయి. రాజమహేంద్రవరం (అర్బన్) నియోజకవర్గంలో పీఎం కిసాన్ కింద 74 మంది రైతులకు రూ.0.01 కోట్లు ,

రాజనగరం నియోజకవర్గంలో గోకవరం మండలంలో 7,705 మంది రైతులకు రూ.3.08 కోట్లు, కోరుకొండ మండలంలో 9,420 మంది రైతులకు రూ.3.77 కోట్లు, సీతానగరం మండలంలో 6,848 మంది రైతులకు రూ.2.74 కోట్లు చొప్పున అన్నదాత సుఖీభవ పథకం కింద మొత్తం 26,227 మంది రైతులకు రూ.10.49 కోట్లు జమయ్యాయి. పీఎం కిసాన్ యోజన కింద గోకవరం మండలంలో 5,485 మంది రైతులకు రూ.1.10 కోట్లు, కోరుకొండ మండలంలో 7,893 మంది రైతులకు రూ.1.58 కోట్లు, సీతానగరం మండలంలో 6,113 మంది రైతులకు రూ.1.22 కోట్లు చొప్పున మొత్తం 22,359 మంది రైతులకు రూ.4.47 కోట్లు జమయ్యాయి. జగ్గంపేట నియోజకవర్గంలో 7,705 మంది రైతులకు రూ.3.08 కోట్లు జమ కాగా, పీఎం కిసాన్ కింద 5,485 మంది రైతులకు రూ.1.10 కోట్లు జమయ్యాయి. గోపాలపురం నియోజకవర్గంలో దేవరపల్లి మండలంలో 6,769 మంది రైతులకు రూ.2.71 కోట్లు, గోపాలపురం మండలంలో 7,886 మంది రైతులకు రూ.3.15 కోట్లు, నల్లజర్ల మండలంలో 8,827 మంది రైతులకు రూ.3.53 కోట్లు చొప్పున మొత్తం 23,482 మంది రైతులకు రూ.9.39 కోట్లు జమయ్యాయి. పి ఏం కిశాన్ కింద దేవరపల్లి మండలంలో 5,703 మంది రైతులకు రూ.1.14 కోట్లు, గోపాలపురం మండలంలో 6,935 మంది రైతులకు రూ.1.39 కోట్లు, నల్లజర్ల మండలంలో 7,134 మంది రైతులకు రూ.1.43 కోట్లు చొప్పున మొత్తం 19,772 మంది రైతులకు రూ.3.96 కోట్లు జమయ్యాయి.

కొవ్వూరు నియోజకవర్గంలో కొవ్వూరు మండలంలో 4,940 మంది రైతులకు రూ.1.98 కోట్లు, చాగల్లు మండలంలో 5,463 మంది రైతులకు రూ.2.19 కోట్లు, తాళ్లపూడి మండలంలో 4,481 మంది రైతులకు రూ.1.79 కోట్లు చొప్పున మొత్తం 14,884 మంది రైతులకు రూ.5.96 కోట్లు జమయ్యాయి. పీఎం కిసాన్ యోజన కింద కొవ్వూరు మండలంలో 4,058 మంది రైతులకు రూ.0.81 కోట్లు, చాగల్లు మండలంలో 4,586 మంది రైతులకు రూ.0.92 కోట్లు, తాళ్లపూడి మండలంలో 3,500 మంది రైతులకు రూ.0.70 కోట్లు చొప్పున మొత్తం 12,144 మంది రైతులకు రూ.2.43 కోట్లు జమయ్యాయి. నిడదవోలు నియోజకవర్గంలో ఉండ్రాజవరం మండలంలో 4,581 మంది రైతులకు రూ.1.83 కోట్లు, నిడదవోలు మండలంలో 7,748 మంది రైతులకు రూ.3.10 కోట్లు, పెరవలి మండలంలో 7,039 మంది రైతులకు రూ.2.82 కోట్లు చొప్పున మొత్తం 19,368 మంది రైతులకు రూ.7.75 కోట్లు జమయ్యాయి. పీఎం కిసాన్ యోజన కింద ఉండ్రాజవరం మండలంలో 3,954 మంది రైతులకు రూ.0.79 కోట్లు, నిడదవోలు మండలంలో 6,409 మంది రైతులకు రూ.1.28 కోట్లు, పెరవలి మండలంలో 4,630 మంది రైతులకు రూ.0.93 కోట్లు చొప్పున మొత్తం 14,993 మంది రైతులకు రూ.3.00 కోట్లు జమయ్యాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని మండపేట నియోజకవర్గంలో రైతులకు గణనీయమైన ఆర్థిక సహాయం అందింది. మండపేట మండలంలో 5,711 మంది రైతులకు రూ.2.28 కోట్లు, కపిలేశ్వరపురం మండలంలో 7,467 మంది రైతులకు రూ.2.99 కోట్లు, రాయవరం మండలంలో 5,105 మంది రైతులకు రూ.2.04 కోట్లు చొప్పున మొత్తం 18,282 మంది రైతులకు రూ.7.31 కోట్లు జమయ్యాయి. పీఎం కిసాన్ యోజన కింద మండపేట మండలంలో 5,147 మంది రైతులకు రూ.1.03 కోట్లు, కపిలేశ్వరపురం మండలంలో 6,667 మంది రైతులకు రూ.1.33 కోట్లు, రాయవరం మండలంలో 4,525 మంది రైతులకు రూ.0.91 కోట్లు చొప్పున మొత్తం 16,339 మంది రైతులకు రూ.3.27 కోట్లు జమ చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో పీఎం కిసాన్ యోజన కింద 1,11,689 మంది రైతులకు రూ.22.34 కోట్లు, అన్నదాత సుఖీభవ పథకం కింద 1,33,273 మంది రైతులకు రూ.53.32 కోట్లు జమ కాగా, ఈ రెండు పథకాల ద్వారా కలిపి రైతులకు మొత్తం రూ.75.66 కోట్ల ఆర్థిక సహాయం అందినట్లు తెలిపారు.

## రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షించాలి: ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. మార్చి 13:** గూడెం మండలంలో వివిధ గ్రామాల్లో జరుగుతున్న రోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపాలు లేకుండా నిర్మాణ పనులను స్థానిక ప్రజలు పర్యవేక్షించాలని శాసనసభ్యులు,రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు. మండలంలో వివిధ గ్రామాల్లో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లిగూడెం గ్రామీణ మండలంలో మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం నిధులతో జగన్నాధపురం నుంచి వెంకటరావుపాలెం వరకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామని అన్నారు.ఒక కోటి 72 లక్షల రూపాయల వ్యయంతో నాణ్యమైన రోడ్డు నిర్మాణం జరుగుతుందని తెలిపారు.వాటితో పాటు దండగర్ర,కొంద్రుపోలు గ్రామాల్లో సిసి రోడ్లు నిర్మాణం పనులను పరిశీలించారు. ఆయనతోపాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు కుడుపూడి ఆధ్వర్యం లో విద్యా సామాగ్రి పంపిణీ




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 13**నగరంలోని 3వ డివిజన్ నెహ్రూ నగర్ స్కూల్ వద్ద 10వ తరగతి విధ్యార్థులకు రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు విద్యా సామాగ్రి నీ అందచేసేందుకు ముందుకొచ్చారు. తన సొంత నిధులతో సుమారు 120 మంది బాలురు, బాలికలకు పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు , స్కేళ్లను సమకూర్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ విద్యార్థులకు సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం సత్తిబాబు చేస్తున్న కృషిని అభినందించారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ పిల్లలు చదువుకోవాలని మంచి సంకల్పంతో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అందరికీ తల్లికి వందనం పథకం అమలు చేస్తూ, లోటు బడ్జెట్ లో కూడా విద్య కోసం కార్పొరేట్ కళాశాలల కు ధీటుగా ప్రభుత్వ కళాశాలలు కూడా ఏర్పాటు చేస్తున్నారన్నారు.పిల్లలకు తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించే విధంగా మెగా పేరెంట్స్ డే నిర్వహిస్తూ పిల్లలకు విద్య వైపు మల్లెలా బాధ్యతలు చేపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిటీ అధ్యక్షులు మజ్జి రాంబాబు, కాశీ నవీన్ కుమార్ ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

. 10వ తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు కార్పొరేట్ కళాశాలల్లో నామమాత్రపు ఫీజుతో చదువుకునేలా అప్పట్లో కార్పొరేషన్ తీర్మానం చేసిందన్నారు. ఆ నిర్ణయం నేటికీ మధ్యతరగతి పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను చేరువ చేయడంలో ఉపయోగ పడుతోందని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## ఎల్పీజీ సిలిండర్ల నిల్వలు ఉన్నాయి ఆందోళన వద్దు

**జిల్లా పౌర సరఫరాల అధికారి వి పార్వతి**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 13**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గృహ అవసరాలు , అత్యవసర సేవలకు నిరంతరాయంగా ఎల్పీజీ సరఫరా జరిగేలా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలైన ఐ ఓ సి ఎల్ హెచ్ పి సి ఎల్ బి పి సి ఎల్ సంస్థలతో పాటు ఎల్పీజీ పంపిణీదారులతో నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నదనీ జిల్లా పౌర సరఫరాల అధికారి వి పార్వతి శుక్రవారం తెలియ చేశారు.

తూర్పు గోదావరి జిల్లాలో ఉన్న 52 ఎల్పీజీ గ్యాస్ పంపిణీదారుల ద్వారా సుమారు 8.67 లక్షల గ్యాస్ కనెక్షన్ దారులకు గ్యాస్ సరఫరా జరుగుతోందన్నారు . తూర్పు గోదావరి జిల్లాకు గోకవరం, విశాఖపట్నం, విజయవాడ ప్రాంతాల్లోని ఎల్పీజీ బాట్లింగ్ ప్లాంట్ల నుంచి గ్యాస్ సరఫరా జరుగుతొందన్నారు. ఎల్పీజీ సిలిండర్ల నిల్వలు తగినంతగా ఉందన్నారు.

సోషల్ మీడియా లో వస్తున్న పుకార్ల కారణంగా రీఫిల్ బుకింగ్‌లు తాత్కాలికంగా పెరిగాయనీ , ముందు వచ్చినదే ముందు వెళ్తుంది విధానంలో డెలివరీలు కొనసాగుతున్నాయన్నారు . కొన్ని చోట్ల తాత్కాలిక జాప్యం ఏర్పడినా , సరఫరా లో ఎటువంటి ఇబ్బందులు లేవని తెలిపారు. పారిశ్రామిక బల్క్ ఎల్పీజీ సరఫరాను మాత్రమే పరిమితం చేయగా, గృహ వినియోగదారులకు ఎల్పీజీ సరఫరా కు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.

జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ల ఆదేశాలు మేరకు, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలతో జిల్లా యంత్రాంగం సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తూ పంపిణీదారులకు సూచనలు జారీ చేస్తున్నాయన్నారు. వినియోగదారులు ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు .వినియోగదారులు తప్పుడు సమాచారం వల్ల అధిక బుకింగ్‌లు చేయడం, హోర్డింగ్ చేయడం నివారించి అవసర మైనప్పుడు మాత్రమే సిలిండర్ బుక్ చేసుకోవాలన్నారు.వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం తూర్పు గోదావరి జిల్లా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశా మన్నారు. ఎల్పీజీ సంబంధిత ఫిర్యాదుల కోసం హెల్ప్‌లైన్ నంబర్: 8074661259 ను సంప్రదించవచ్చునన్నారు.

ప్రతి గ్యాస్ ఏజెన్సీ తమ వద్ద ఉన్న ప్రస్తుత స్టాక్, పెండింగ్ బుకింగ్‌లు, గ్యాస్ డెలివరీ రోజులు వంటి వివరాలను వినియోగదారులకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో ప్రస్తుతం సుమారు 225.46 మెట్రిక్ టన్నులు గ్యాస్ (15,742 సిలిండర్లు) అందుబాటులో ఉన్నాయన్నారు.

వినియోగ దారులు ఒకేసారి ఎక్కువగా బుకింగ్‌లు ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా కూడా గ్యాస్ బుకింగ్ చేసుకోవచ్చన్నారు.

భారత్ గ్యాస్:
వాట్సప్ 1800 22 4344 కు "
మిస్డ్ కాల్: 7710955555
ఐ వి ఆర్ ఎస్ 7715012345 / 7718012345, ఇండేన్ గ్యాస్ కు
వాట్సప్ : 7588888824 కు ,
మిస్డ్ కాల్ : 8454955555
ఐ వి ఆర్ ఎస్: 7718955555
హెచ్ పి గ్యాస్:
వాట్సప్ : 9222201122 కు "ఎఱ" పంపాలి
మిస్డ్ కాల్: 9493602222
ఐ వి ఆర్ ఎస్c : 8888823456 / 9666023456

సంబంధిత ఆయిల్ కంపెనీల మొబైల్ యాప్‌ల ద్వారా కూడా గ్యాస్ బుకింగ్ చేసుకోవచ్చని డి ఎస్ వో వి పార్వతి తెలిపారు.

## కవయిత్రి మొల్ల జన్మదినోత్సవం సందర్భంగా ఘన సత్కారం



**గంగవరం, పెన్ పవర్, మార్చి 13 :** తెలుగు సాహిత్యానికి విశిష్ట సేవలందించిన ప్రముఖ కవయిత్రి మొల్ల జన్మదినం సందర్భంగా గంగవరం లో భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమ్మర కులానికి చెందిన మహిళలు గొడి సూర్యకాంతం, గొడి కృష్ణ కుమారి లను ఘనంగా సన్మానించి సత్కరించారు.కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ కవయిత్రి మొల్ల తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానం సంపాదించారని, ఆమె రచనలు సమాజానికి ప్రేరణగా నిలిచాయని పేర్కొన్నారు. సమాజంలోని వివిధ వర్గాల మహిళలు సాహిత్యం, విద్య, సామాజిక రంగాలలో ముందుకు రావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి స్వప్న కుమారి, బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి సత్యనారాయణమ్మ, ఓబీసీ మోర్చా జనరల్ సెక్రటరీ సూర్య చంద్ర తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

## కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలు





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 13:**బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్.మాధవ్ ఆదేశాలతో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా కవయిత్రి అట్లూరి మొల్ల మాంబ జయంతిని బిజెపి ఓబీసీ మోర్చా తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు మరుకుర్తి నరేష్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో రాజమండ్రి రూరల్ రెండవ మండలం ధవలేశ్వరం గ్రామంలో కుమ్మర వీధి లో శాలివాహన సంఘ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు పాల్గొని మాట్లాడుతూ,మట్టి మన సంస్కృతి. మట్టి మన జీవనం అని ఆ మట్టిని కళాకృతిగా మార్చి సమాజానికి అవసరమైన పాత్రలను అందించిన గొప్ప సంప్రదాయం ఉన్న మట్టి లో పుట్టిన మాణిక్యం కవయిత్రి మొల్లమాంబ అని అన్నారు. మరుకుర్తి నరేష్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ మట్టిలొ మన పూర్వీకుల గౌరవం, సంస్కృతి, జీవనతత్వం దాగి ఉందని భారతీయ జనతా పార్టీ నమ్ముతుందన్నారు,

గొప్ప సంప్రదాయం నుంచి వెలుగొందిన మహా కవయిత్రి అతుకూరి మొల్లమాంబ అని తెలుగు సాహిత్యానికి ఆమె అపారమైన సేవ చేశారని, సాధారణ కుమ్మరి కుటుంబంలో జన్మించి , దైవ చింతనతో జ్ఞానాన్ని పొంది మొల్ల రామాయణం రచించి ప్రజలకు మరింత దగ్గర చేశారన్నారు. ఆమె ప్రతిభ భారతీయ సమాజానికి గర్వకారణమన్నారు, రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పండురి అప్పారావు పాల్గొని మాట్లాడుతూ కవయిత్రి మొల్లమాంబ కుమ్మరి సామాజిక వర్గంలో పుట్టి సామాజిక వర్గానికి గౌరవం తెచ్చింరన్నారు ఈ కార్యక్రమంలో ఓ బి సి ఇంచార్జ్ పైలా సుభాష్ చంద్రబోస్, కాలెపు సాయిరాం, ఎన్.వి.బి.ఎన్.ఆచారి, శ్రీకాకుళపు దుర్గాప్రసాద్, గుజ్జుల సూరిబాబు, గుర్రాల వెంకట్రావు, ఒంటెద్దు స్వామి, వంకధారి కుబేరరావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు జాతీయ లోక్ అదాలత్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 13 :** రెండవ శనివారం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకుని రాజీమార్గంలో కేసులను పరిష్కరించు కోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత శుక్రవారం కోరారు. కాకినాడ, తూర్పు గోదావరి, డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలు పోలవరం (రంపచోడవరం డివిజన్) పరిధిలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిం చనున్నట్లు తెలిపారు.ఈ లోక్ అదాలత్‌లో రాజీ పడతగ్గ క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, ప్రోనోటు బకాయి కేసులు, మోటారు వాహన ప్రమాదాల కేసులు, భార్యాభర్తల కుటుంబ తగాదాలు, గృహహింస, మనోవర్తి కేసులు, బ్యాంకు రుణ బకాయిలు , వివిధ సివిల్ కేసులను పరస్పర రాజీ ద్వారా పరిష్కరించుకోవచ్చనన్నారు. కేసులను త్వరగా పరిష్కరించు కోవడం ద్వారా విలువైన సమయం, డబ్బు ఆదా చేసుకోవచ్చని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసు కోవడానికి న్యాయవాదులు, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది , మండల న్యాయ సేవల కమిటీ సిబ్బందిని సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు.

# కల్తీ పాల ఘటన లో ఇద్దరు మృతి

**16కు చేరిన మృతులు**



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ , మార్చి 13** నగరం లో జరిగిన పాలు కల్తీ ఘటనకు సంబంధించిన ఆరోగ్య సమస్యల నేపథ్యంలో డెల్టా ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న శ్రీమతి రెడ్డి.అనంత లక్ష్మి ( 55 ) శుక్రవారం ఉదయం మృతి చెందారు. కిమ్స్ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న కడలి.కృష్ణారావు ( 73 ) మధ్యాహ్నం 12.52 గంటలకు తీవ్ర మూత్రపిండల వైఫల్యంతో మరణించారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కె. వెంకటేశ్వర రావు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ తరపున ప్రగాఢ సానుభూతి తెలిపారు. 5 మంది రోగులు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మిగిలిన రోగుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షణలో ఉంచి, అవసరమైన అన్ని వైద్య చర్యలు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

రోగులు సంబంధిత నిపుణుల వైద్యుల పర్యవేక్షణలో వైద్య చికిత్స పొందుతున్నారని, ప్రభుత్వ ఆదేశాల మేరకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని కె. వెంకటేశ్వర రావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పరిస్థితిని దగ్గరగా ఉండి పర్యవేక్షణ చేస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కే వెంకటేశ్వర రావు తెలియ చేశారు.

# నేటితో మండలంలో అన్ని గ్రామాలలో ఉపాధి సామాజిక తనిఖీ గ్రామసభలు ముగింపు.

- కొత్తపల్లిలో ఇంటి దొంగలను వదిలేస్తారా.....?????




**గోకవరం పెన్ పవర్ మార్చి 13 :--** 2024 2025లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై ప్రతి ఏటా సామాజిక తనిఖీ నిర్వహించడం ఏమైనా అవకతవకలు జరిగితే వాటిని వెలికి తీయడం సామాజిక తనిఖీ ముఖ్య ఉద్దేశం.దీనిలో భాగంగా గోకవరం మండలంలోని గత నెల రోజులుగా సామాజిక తనిఖీ జరగడం వాటిని గ్రామ సభల్లో చదివి వాస్తవాలను బయటకు తీయడం అనేది జరిగే ప్రక్రియ అటువంటి గ్రామసభలు నేటితో మండలంలో ముగియనున్నాయి మండలంలోని 14 గ్రామపంచాయతీలలో వివిధ మండల స్థాయి అధికారుల పర్యవేక్షణలో ఉపాధి గ్రామసభలు నిర్వహించి ఉపాధి పథకం ద్వారా చేపట్టిన పనులు వాటి పురోగతిపై సమీక్షిస్తారు అందులో ఏదైనా జరిగి ఉంటే వాటిపై చర్యలు కూడా ఈ గ్రామసభ ద్వారా ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించి చర్యలకు నివేదిస్తారు. ఇది ఇలా ఉంటే మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఎలాంటి ఉద్యాన పంటలు వేయకపోయినా సుమారు రెండు లక్షల రూపాయల వరకు ఉపాధి నిధులు దోచుకున్నరు ఉపాధి శాఖలో పనిచేస్తున్న ఉద్యోగి బంధువు పేరుతో ఈ అక్రమాలకు పక్కా స్కెచ్ ప్రకారం దోసుకున్నారు దీనిని గత సామాజిక తనిఖీలో బయట పెట్టడం నిధులు రికవరీ చేయకపోతే తన జీతం నుండి రికవరీ చేయాల్సి ఉంటాదని సంబంధిత గోకవరం ఎంపీడీవో నోటీసు ఇచ్చిన లెక్క చేయని అక్రమార్కులు ఒక్క రూపాయి కూడా నేటికీ కట్టక పోవడం చూస్తుంటే కావాలనే ఇంటి దొంగలు ఇలాంటి అక్రమార్కులకు సహకరిస్తున్నారు అనే అనుమానాలు వ్యక్తం చేస్తూ కొత్తపల్లి గ్రామానికి చెందిన పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. గోకవరం మండలం లో నేటితో ముగుస్తున్నాయి మండల స్థాయిలో జరిగిన అంతటినీ మండల స్థాయి సభ ఏర్పాటు చేసి ఆ సభ ముందు జిల్లా స్థాయి అధికారుల సమక్షంలో సమీక్షిస్తారు ఆ గ్రామసభను ఎప్పుడూ అనేది జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నిర్వహించనున్నట్లు సంబంధిత శాఖ అధికారులు తెలిపారు. కొత్తపల్లి లో జరిగిన ఈ నిధులు దుర్వినియోగం చూస్తుంటే ఇంటి దొంగల సహకారమే వీరికి ఉన్నట్లు ఇదే ఒరవడి కొనసాగిస్తే ఎవరిష్టం వచ్చినట్టు వారు ఉపాధి హామీ నిధులు దోచుకోండి మేము నోటీసులతో సరిపెడతాం తప్ప మీ మీద ఏ విధమైన చర్యలు ఉండవన్నట్లు సంకేతాలు ఇస్తున్నట్లు ఉన్నాయని పలువురు అంటున్నారు.

# కొబ్బరికాయల విక్రయ వేలం నిర్వహణ పాట

- శ్రీరామగిరి దేవస్థానం చైర్మన్,పెందుర్తి సుదర్శన్,
- టిడిపిమండల అధ్యక్షులు బొర్రా నరేష్,కుమార్



**వి.ఆర్.పురం పెన్.పవర్.మార్చి13:** మండలంలోని శ్రీరామగిరి దేవస్థానం ఆలయం ప్రాంగణంలో శుక్రవారం శ్రీరామగిరి దేవస్థానం చైర్మన్ పెందుర్తి సుదర్శన్,టిడిపిపార్టీ మండలఅధ్యక్షులు బొర్రా నరేష్,కుమార్,పంచాయితీసర్పంచ్,పులి సంతోష్,కుమార్,జూనియర్ అసిస్టెంట్,సాయిబాబు,ఆధ్వర్యంలో కొబ్బరి కాయల విక్రయవేలం నిర్వహణ పాట నిర్వహించడం జరిగింది.కొబ్బరికాయల విక్రయ పాటను సీతంపేట గ్రామానికి చెందిన పెదపెట్ల పవన్ కళ్యాణ్,1లక్ష 26 వేల రూపాయలకు పాట,పాడి దక్కించుకున్నారు.అదేవిధంగా లడ్డు ప్రసాదాలు విక్రయాల పాటను శాఖ మాధవి భద్రాచలం యాభైవేలరూపాయలకు దక్కించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్,కొడిసెల దుర్గారావు,టిడిపి పార్టీ మండల అధ్యక్షులు బొర్రా నరేష్,కుమార్,టిడిపిపార్టీ నాయకులు బీరక సూర్య ప్రకాశరావు,సిపిఎం నాయకులు కమ్మ చిచ్చు సత్యనారాయణ,గుండిపూడి లక్ష్మణరావు, నేత్రిబోయిన రాజు,జనసేన నాయకులు పెదపెట్ల పవన్ కళ్యాణ్, దేవాలయ అర్చకులు సౌమిత్రి పురుషోత్త మాచార్యులు ఆలయ సిబ్బంది.కొండబాబు,వెంకన్న దొర,గ్రామ పెద్దలు,కూటమినాయకులు తదితరులు పాల్గొన్నారు.


# అర్జీలు ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తాం





- ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి:
- ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, మార్చి 13:**ప్రజల నుండి వచ్చే అర్జీలను ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి పరిష్కరిస్తామని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీషాదేవి తెలిపారు. రంపచోడవరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మండల పార్టీ అధ్యక్షుడు పెంటపాటి అనంత మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను తెలియజేస్తూ దరఖాస్తులతో పాటు ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ వివరాలు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. అందిన ప్రతి దరఖాస్తును పరిశీలించి పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు.వై. రామవరం మండలంలో ఇటీవల జరిగిన సచివాలయ ఉద్యోగిని ప్రమాద ఘటనపై సచివాలయ నాయకులు ఎమ్మెల్యేను కలిసి న్యాయం చేయాలని కోరారు. దీనిపై వెంటనే స్పందించిన ఆమె రంపచోడవరం ప్రాజెక్ట్ అధికారి తో ఫోన్‌లో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.రోడ్డు విస్తరణ కారణంగా దుకాణాలు కోల్పోయిన గిరిజనులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఇప్పటివరకు కల్పించలేదని వచ్చిన వినతులపై త్వరలోనే పరిష్కారం చూపిస్తామని ఆమె తెలిపారు. అలాగే పలు గ్రామాల నుంచి మౌలిక వసతుల సమస్యలపై వచ్చిన అర్జీలను పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రంపచోడవరం మండలంలో త్రాగునీటి సమస్యపై స్పందిస్తూ ఎంపీడీఓతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పిడతమామిడి గ్రామంలో సెల్ టవర్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వచ్చిన వినతిపై సంబంధిత అధికారులతో మాట్లాడి టవర్ నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సుభానీ, రంపచోడవరం మండల పార్టీ అధ్యక్షుడు పెంటపాటి అనంత మోహన్, ఏఎంసీ వైస్ చైర్మన్ సలాది బాపిరాజు, సీతపల్లి గుడి చైర్మన్ కుంజం బాపన్నదొర, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు అడబాల బాపిరాజు, కోసు నాగన్న దొర, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి స్వప్న కుమారి, మారేడుమిల్లి మండల పార్టీ అధ్యక్షుడు గురుకు శేషుకుమార్, జనసేన నాయకుడు పాపోలు శ్రీనివాసరావు, గంగవరం మండల పార్టీ అధ్యక్షుడు పల్లాల వెంకటరెడ్డి, దేవీపట్నం మండల పార్టీ అధ్యక్షుడు గోళ్ల చంటిబాబు, మాజీ సర్పంచ్ నిరంజనీ దేవి, సీతపల్లి గుడి దేవస్థానం సభ్యుడు సిద్ధ వెంకన్న దొర, రంపచోడవరం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు షేక్ చోటు, టీడీపీ సీనియర్ నాయకుడు గణజాల తాతారావు, దేవీపట్నం సొసైటీ అధ్యక్షుడు మాగాపు బాబురావు, జనసేన మారేడుమిల్లి అధ్యక్షుడు మల్ల దుర్గ ప్రసాద్, గంగవరం మాజీ ఎంపీపీ తీగల ప్రభ, పతివాడ రమణ, కోసు రామన్న దొర, పరదా సత్యవేణి, బీజేపీ సత్యనారాయణమ్మతో పాటు రంపచోడవరం ఎంపీడీఓ ప్రసాద్, రెవెన్యూ ఆర్ఐ నిర్మల కుమారి మరియు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.




# ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యకరమైన సమాజం






**గోకవరం పెన్ పవర్ మార్చి 13:-** గోకవరం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై మండల స్థాయి అవగాహన సదస్సు, సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం అదనపు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మహబూబ్ వలీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలు, రసాయన రహిత ఆహారం ప్రాముఖ్యతపై మహిళా సంఘాలకు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ లో భాగంగా ప్రతి గ్రామంలో 125 మంది రైతులతో ప్రకృతి వ్యవసాయం చేయించాలని, ఖరీఫ్ ప్రణాళికలో ఇందుకు వెలుగు సిబ్బంది పూర్తి సహకారం అందించాలని కోరారు. మహిళా సంఘాల ద్వారా పెరటి తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని, జీవ వనరుల కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన సాయం అందిస్తామని అధికారులు తెలిపారు. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు, పేద మహిళలకు ఈ విధానం ఎంతో మేలు చేస్తుందని వివరించారు. ఈ సమావేశంలో వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ జయంత్ రాజ్, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది, మహిళా సంఘాల అధ్యక్షురాళ్లు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

# వందమంది విద్యార్థులకు ప్యాడ్లు,పెన్నులు అందజేత

- మండల ఎం.ఆర్.పి.ఎస్.యూత్,సభ్యులు
- విద్యాశాఖాధికారి,వి.వి.లక్ష్మి,నారాయణ

**వి.ఆర్.పురం పెన్.పవర్.మార్చి.13:**మండలంలోని వి.ఆర్.పురం జిల్లా పరిషత్,ఉన్నత పాఠశాలో రానున్న పదవ తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న వందమంది విద్యార్థినులకు శుక్రవారం వి.ఆర్.పురం మండల ఎం.ఆర్.పి.ఎస్.యూత్,సభ్యులు ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో పరీక్షా ప్యాడ్లు,పెన్నులను ఉచితంగా అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖాధికారి,వి.వి. లక్ష్మి నారాయణ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు అజయ్,కుమార్,మాజీ ఉపాధ్యాయులు కారం రాము పాల్గొని,మాట్లాడారు .వి.ఆర్.పురం మండల ఎం.ఆర్.పి. ఎస్.యూత్,సభ్యులను పలువురు గ్రామపెద్దలు,ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా ఎం.ఆర్.పి.ఎస్.మండలయూత్,సభ్యులు మాట్లాడుతూ, విద్యార్థులు పట్టుదలతో చదువు కొని,మంచి మార్కులతో పాసుఅవ్వాలని,తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు,పాఠశాలకు,మండలానికి మంచిపేరు తీసుకురావాలని,కోరారు. ఈకార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ముత్యాల శంకర్రావు, ఎం.ఆర్.పి.ఎస్.మండలయూత్,సభ్యులు పాఠశాల సిబ్బంది.విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# గ్రామీణ ప్రాంతం లో విద్యాభివృద్ధికి పార్డ్ సంస్థ కృషి - సుబ్బారావు.



**గోపాలపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 13.**పల్లెల్లోని మారుమూల ప్రాంతాలలో విద్యను అభివృద్ధి చేయడమే ప్రగతి అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ సంస్థ యొక్క ప్రధాన ఉద్దేశ్యం అని ఆ సంస్థ మండల శాఖ ఉపాధ్యక్షులు, విశ్రాంత మిలటరీ అధికారి వింజమూరి సుబ్బారావు అన్నారు. గోపాలపురం పెద్దగూడెం, బీసీ కాలనీలలో పదవ తరగతి పరీక్షలు రాసే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని పంపిణీ చేశారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 25 మంది విద్యార్థులకు ఈ సామాగ్రిని సంస్థ మండల శాఖ అధ్యక్షులు దొడ్డి గర్ల వెంకటేష్, కార్యదర్శి చింతలపూడి భాస్కరరావు, కోశాధికారి ఏం కొండల రావు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా విశ్రాంత మిరిటరీ అధికారి పార్డ్ ఇండియా సంస్థ ఉపాధ్యక్షులు సుబ్బారావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు సమాజంలో ఎంతో ఉన్నతమైన ప్రభుత్వ ఉద్యోగాలలో ఉన్న వారు అంతా కష్టపడి చదువుకొని అభివృద్ధి చెందిన వారే అని అన్నారు. వారిలో ఎక్కువ శాతం మంది ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించి ప్రణాళికాబద్ధంగా చదువుకొని అనుకున్న లక్ష్యాలను సాధించిన వారు అన్నారు. అటువంటివారిని నేటి యువత ఆదర్శంగా తీసుకుని నాణ్యమైన విద్యను అభ్యసించి అనుకున్న లక్ష్యాలను సాధించాలని సూచించారు. సంస్థ సహాయ కార్యదర్శి రేవుల గడ్డ భాస్కర రావు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు తమ బిడ్డల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రతి బిడ్డ చదువుకునే విధంగా చూడాలని అన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చదువుకు పేదరికం అడ్డు కాదు అని ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు చదువుకునే వారికి అండగా నిలిస్తున్నాయని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యవర్గ సభ్యులు కొండే సుబ్బారావు,పాములు తిరుపతయ్య, గుమ్మడి నాగేశ్వరరావు, ఆర్ఎంపి వైద్యుడు శ్రీనివాస్, చింతలపూడి శ్రీనివాసరావు, బేతాళ శ్రీనివాసరావు, గుమ్మడి నాగేంద్రబాబు, సరిపల్లి వెంకటేశు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పరీక్ష కిట్లును అందజేసిన ఎమ్మెల్యే



**జీలుగుమిల్లి, పెన్ పవర్, మార్చి 13 ;** విద్యార్థి జీవితంలో 10వ తరగతి ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు .శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిబిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కిట్లు పంపిణీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకుని కుటుంబానికి, సమాజానికి గౌరవం తీసుకురావాలని అన్నారు .ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యకు అత్యంత ప్రాధాన్యత ఉందని అన్నారు. ప్రభుత్వం కూడా విద్యార్థుల అభివృద్ధికి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని అన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు మరియు ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న సుమారు 2 ,5 55 మంది 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, షార్ప్నర్, జామెంట్రీ బాక్స్ వంటి అవసరమైన సామాగ్రి నీ సంబంధిత ఉపాధ్యాయులకు అందించారు. పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలకు పాల్గొన్నారు.

# ఆరోగ్య ప్రదాయిని పసందైన పనస



**గోపాలపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 13.**కాలానుగుణంగా పండే పంటల్లో చెప్పుకో తగ్గది పనస. కేవలం వేసవికాలంలో మాత్రమే ఈ కాయలు కాస్తూ ఉంటాయి. ముఖ్యంగా మెట్ట ప్రాంతాల్లో ప్రకృతి సహజ సిద్ధంగా ఈ కాయలు కాస్తూ ఉంటాయి. జనవరి నెలలో పూత పిందేతో ప్రారంభమైన ఈ కాయలు మార్చ్ నుండి జూన్ జూలై వరకు మార్కెట్లో మనకు కనిపిస్తూనే ఉంటాయి. మానవుడి తినే పండ్లలో అత్యంత ప్రీతివంతమైనది పనసపండు అని చెప్పుకోవచ్చు. పనస కాయ పచ్చిది మొదలు పండిన కాయ వరకు ఎంతో శ్రేష్టమైనదిగా వైద్యులు సూచిస్తూ ఉంటారు. పైన పచ్చని ముల్లులా ఉండే లోపల ముత్యాల మధ్య పనస తొన్నలు వాటిలోపల గింజలు ఉంటాయి. పచ్చి పనస ను వివిధ శుభకార్యాలలో వంటకు ఉపయోగిస్తూ ఉంటారు. అయితే ఇటీవల చైనా వంటి దేశాలతో పాటు కేరళ లాంటి రాష్ట్రాలలో పచ్చి పనసపొడిని షుగర్ వ్యాధిగ్రస్తులకు దివ్య ఔషధంగా చెబుతున్నారు. పచ్చి పనసను ఎండబెట్టి పౌడర్ చేసి ప్రతినిత్యం ఒక స్పూను ఏదో ఒక రూపంలో కడుపులోకి తీసుకుంటే షుగర్ వ్యాధిని నియంత్రించవచ్చునని వైద్యులు సలహాయిస్తున్నారు. దీనితో ఇప్పటివరకు కేవలం కూరలకు మాత్రమే ఉపయోగించి ఈ పచ్చి పనసను ప్రస్తుతం పౌడర్ రూపంలో ఆరోగ్యంగా ఉండడానికి తీసుకుంటున్నారు. పండు విషయానికి వస్తే బంగారు వర్ణంలో ఉండే ఈ తొన్నలు ఎంతో రుచికరం గా ఉంటాయి. సువాసన వెదజల్లే ఈ తొనల్లో విటమిన్ ఏ, సి, బి6 లు ఉంటాయి. ఇవి తినడం వలన కంటిచూపు మెరుగు పడడంతో పాటు చర్మం ఆరోగ్యంగా ఉండడం, రోగ నిరోధక శక్తి ఇవ్వడం తో పాటు, రక్తంలో హిమోగ్లోబిన్ పెరిగి మెదడు చురుకుగా పని చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. అలాగే పీచు పదార్థం సైతం ఎక్కువగా ఉండటం వలన జీర్ణక్రియ సక్రమంగా జరిగి బరువు సైతం తగ్గుతుందని వైద్యులు సూచిస్తున్నారు. పొటాషియం, మెగ్నీషియం, కాపర్ సైతం ఇందులో పుష్కలంగా ఉంటాయి. అయితే షుగర్ వ్యాధిగ్రస్తులు మాత్రం పన్నస తొన్నల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీనిలో కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉండటం వలన కేవలం తక్కువ షుగర్ ఉన్నవారు మాత్రమే రోజుకు ఒకటి లేదా రెండు తొన్నలు తీసుకోవాలని తీసుకోవాలని చెప్తున్నారు. అది కూడా వైద్యుల సలహా మేరకు మాత్రమే తినాలని అంటున్నారు. ఇక గింజల విషయానికొస్తే వాటిని నిప్పులో కాల్చుకుని లేదా నీళ్లల్లో ఉడకబెట్టి తినవచ్చు. కొంతమంది ఈ గింజలను కూరకు సైతం ఉపయోగిస్తూ ఉంటారు. ఇందులో పిండు పదార్థం తో పాటు ప్రోటీన్లు, మినరల్స్ ఎక్కువగా ఉంటుంది. ఇక చెట్టు విషయానికి వస్తే పనస కర్రతో వీణ, మృదంగం, తబలా తదితర వాయిద్య పరికరాలకు ఎక్కువ గా ఉపయోగిస్తారు.పనస చెక్క పసుపు,ఎరుపు రంగులు కలిసి ఉండడం తో ఇంట్లో అలంకరణ వస్తువులకు కబోర్డులు, తలుపులు కు ఈ చెక్కలను ఎక్కువగా ఉపయోగిస్తారు.ఈ ఆకులతో తయారుచేసిన విస్తరిలో మాత్రమే తీర్థయాత్రలకు వెళ్లి వచ్చినవారు నేల పై కూర్చుని భోజనం చేసేవారు. పనస ఆకులను సేకరించి విస్తరాకుగా తయారుచేసి అందులో ఆహార పదార్థాలను వడ్డించుకుని తృప్తిగా భోజనం చేయడం హిందువులకు ఆనవైతిగా ఉండేది. ఇంత ఉపయోగమైన, ఆరోగ్య ప్రదాత పనసను మనం నిర్లక్ష్యం చేస్తున్నాం అనడంలో ఎటువంటి సందేహము లేదు. గత ఒకటి రెండు దశాబ్దాల క్రిందట మెట్ట ప్రాంతంలో ప్రతి పొలంలో ఒకటి నుండి పది వరకు పనస చెట్లు ఉండేవి. రాను రాను పనస చెట్ల సంఖ్య గణనీయంగా తగ్గిపోతూ వస్తున్నది. ప్రస్తుతం కేవలం కొద్ది సంఖ్యలో మాత్రమే ఈ పనస చెట్లు అక్కడక్కడ కనిపిస్తూ ఉండడం విశేషం. ప్రజలకు ఆరోగ్యాన్ని ఇచ్చి దివ్య ఔషధంగా ఉన్న ఈ పనసను పరిరక్షించవలసిన బాధ్యత ప్రభుత్వానికి, ప్రజలకు ఉంది. ప్రతి ఒక్కరూ పర్సనల్ లోని దివ్య గుణాలను తెలుసుకొని పనస చెట్లను పరిరక్షించాలని పనస ప్రేమికులు కోరుతున్నారు.

## పీఎం కిసాన్ పథకం ప్రతి అర్హత గల రైతు కుటుంబానికి సంవత్సరానికి ₹6,000 నగదు సహాయం .





**తాడేపల్లిగూడెం.పెన్ పవర్. మార్చి 13:** పశ్చిమగోదావరి జిల్లా, వెంకరామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో పీఎం కిసాన్ రెండో విడత విడుదల కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బిబొలిశెట్టి శ్రీనివాస్ ప్రధాన అతిథిగా హాజరై రైతులతో మాట్లాడారు.

కార్యక్రమంలో మాట్లాడిన శ్రీ బొలిశెట్టి శ్రీనివాస్ , పీఎం కిసాన్ పథకం ద్వారా ప్రతి అర్హత గల రైతు కుటుంబానికి సంవత్సరానికి ₹6,000 నగదు సహాయం నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయబడుతుందని, ఈ పథకం రైతుల ఆర్థిక స్థిరత్వం పెంపుదలకు ఎంతో ఉపయోగపడుతోందని తెలిపారు. ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా చూస్తోందని, రెండో విడత నిధులు సమయానికి రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయన్నారు.

ఈ కార్యక్రమం లో విశ్వ విద్యాలయ ఉపకులపతి డ్రా. ధనుంజయ రావు పాల్గొని ప్రభుత్వ సహకారం తో విశ్వ విద్యాలయం రైతులకు మరింత నాణ్యమైన సేవలు అందిస్తోంది అని తెలియచేసారు.

కార్యక్రమానికి విశ్వ విద్యాలయ అధికారులు డాక్టర్. ఎమ్. మాధవి, రిజిస్ట్రార్, , డాక్టర్. జి. రామచంద్ర, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్, డాక్టర్ ఎస్ సూర్యకుమారి, డీన్ అఫ్ ్రా+ స్టడీస్ , డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ మరియు ఇతర విశ్వ విద్యాలయ అధికారులు విచ్చేశారు.

కార్యక్రమంలో విస్తరణ సంచాలకులు డా. సీహెచ్. రూత్, మాట్లాడుతూ, రైతుల సేవలో విస్తరణ వ్యవస్థ పాత్రపై విశేషంగా ప్రస్తావించారు. ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలు, కెవికె లు, లైన్ డిపార్ట్మెంట్లు, మరియు ఇతర వ్యవసాయ సంస్థలు కలిసి పనిచేసే సహకార వ్యవస్థ ద్వారానే రైతులకు సమగ్ర సేవలు అందుతాయని, నూతన సాంకేతికతలను రైతుల వద్దకు తీసుకురావడంలో కెవికె లు ఒక బలమైన వేదికగా పనిచేస్తున్నాయని తెలిపారు.

ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు పంటల నిర్వహణ, ఖర్చును తగ్గించే ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సమగ్ర పోషక నిర్వహణ, నీటి సంరక్షణ విధానాలపై అవగాహన కల్పించారు. అలాగే ఈ కెవిసి మరియు భూ రికార్డుల అప్డేషన్ వంటి ప్రక్రియలను పూర్తిచేసుకోవడం ద్వారా రైతులు పీఎం కిసాన్ లబ్ధిని నిరంతరం పొందగలరని తెలియజేశారు.


కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా శ్రీ వలవల మల్లికార్జునరావు రాష్ట్ర భవనం మరియు ఇతర కార్మిక సంఘాల సంక్షేమ బోర్డు చైర్మన్, శ్రీ ఈతకోట భీమశంకర్ రావు బిజెపి అసెంబ్లీ ఇన్చార్జి తాడేపల్లిగూడెం, శ్రీ ఆర్ గంగాధర్ రావు ఏడిఏ తాడేపల్లిగూడెం మరియు ఇతర సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.కార్యక్రమంలో భాగంగా రైతులకు వ్యవసాయ వనరులు, మరియు స్ప్రేయర్లు, సమాచార కర పత్రాలు, కృషి సాంకేతికత పుస్తకాలు పంపిణీ చేశారు.

## విద్యార్థులు వినూత్న ఆవిష్కరణలపై దృష్టిపెట్టాలి

ఏపీ నిట్ ఇంచార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్, డాక్టర్ ఎన్.వి.రమణారావు.







**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 13.**తాడేపల్లిగూడెం ఆంధ్రప్రదేశ్ నిట్ విద్యార్థులు వినూత్న ప్రాజెక్టులపై దృష్టిసారించాలని ఏపీ నిట్ ఇంచార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.వి.రమణారావు సూచించారు. డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న ఉల్కన్ జీ 2కె26 ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్బంగా నిర్వహించిన సమావేశంలో ప్రొఫెసర్, డాక్టర్ ఎన్.వి.రమణారావు మాట్లాడుతూ దేశంలో 31వ నిట్ గా ఏర్పడిన ఏపీ నిట్ పదేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకోవడం అభినందనీయమని కొనియాడారు. తాత్కాలిక క్యాంపస్ నుంచి శాశ్వత క్యాంపస్ ను ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో అద్భుతమైన భవనాలు, ప్రయోగశాలలతో తీర్చిదిద్దారని ప్రశంసించారు. సంస్థలో చదువుకుంటున్న విద్యార్థులకు అవసరమైన అన్ని మౌళిక సదుపాయాలను కల్పిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకుని భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. విద్యార్థులు వేసే ప్రతి అడుగు వారి విజయానికి మెట్టుగా నిలవాలన్నారు. తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతి విద్యార్థి నడుచుకోవాలని చెప్పారు. ఆధునిక పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించటంతోపాటు సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని తెలిపారు. సృజనాత్మక ప్రతిభ కలిగిన విద్యార్థులకు డిమాండ్ ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. భారతదేశానికి చెందిన ఎంతోమంది శాస్త్రవేత్తలు అద్భుత ఆవిష్కరణలు రూపొందించి ప్రపంచదేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నారని, వారి స్ఫూర్తితో విద్యార్థులు ఇన్నోవేటివ్ ప్రాజెక్టులను సాధించే దిశగా ఆడుగులు వేయాలని సూచించారు. ఉల్కన్ జీ ఉత్సవాల్లో చురుగ్గా పాల్గొంటున్న విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ హిమబిందు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అసోసియేట్ డీన్ డాక్టర్ రాజేశ్వర రెడ్డి కో ఆర్డినేటర్ గా వ్యవహరించారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో అలరించాయి. ముందుగా ఇంచార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్, డాక్టర్ ఎన్.వి.రమణారావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీన్లు డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి, డాక్టర్ వి.సందీప్, డాక్టర్ ఎన్.జయరామ్,డాక్టర్ జీబి.వీరేష్ కుమార్, పలువురు అసోసియేట్ డీన్లు, విభాగాధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

- కమిషనర్ రాహుల్ మీనా
- నగర పరిశుభ్రతలో మహిళా



**రాజ మహేంద్రవరం పెన్ పవర్ మార్చి 13:**పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని ,వారి సేవలు సమాజానికి అమూల్యమైనవని కమిషనర్ రాహుల్ మీనా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'నారీ లీడ్స్ స్వచ్ఛత' కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్ నందు శుక్రవారం పలువురు మహిళా పారిశుద్ధ్య కార్మికులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రసంగిస్తూ, సమాజం పరిశుభ్రంగా ఉండేందుకు ప్రతిరోజూ కష్టపడి పనిచేస్తున్న మహిళా కార్మికులు నిజమైన సేవకులని కొనియాడారు. ప్రజా శ్రేయస్సుకై ప్రతినిత్యం శ్రమిస్తున్న మహిళామణుల కృషిని గౌరవించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అవసరమన్నారు. . మహిళల హక్కులు కల్పిస్తూ రక్షణగా నిలవడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. ప్రభుత్వం మహిళా సాధికారత కోసం అనేక పథకాలను ప్రవేశపెడుతోందని, వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా సామాజికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్మికులకు శాలువాలు కప్పి, ప్రశంసాపత్రాలతో గౌరవించారు. రంగోలీ పోటీలలో గెలుపొందిన మహిళలకు ప్రశంసాపత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ ఎ.వినూత్న, శానిటరీ సూపర్ వైజర్ కె.రామలింగారెడ్డి, శానిటరీ ఇన్స్ పెక్టర్లు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## హెల్మెట్ పై అవగాహన



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, మార్చి 13 ;** ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని జీలుగుమిల్లి ఎస్ఐ వి క్రాంతి కుమార్ సూచించారు. శుక్రవారం జీలుగుమిల్లిలో పోలీస్ స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై హెల్మెట్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి నియమ నిబంధనలు పాటించి నట్లయితే ప్రమాదాలను తగ్గించవచ్చని అన్నారు. హెల్మెట్లు ధరించడం వలన ప్రమాదం జరిగినప్పుడు కొంతమేర బయటపడవచ్చు అని అన్నారు. కనుక ప్రతి ఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. లేనిపక్షంలో అపరాధ రుసుము చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు.

## నియోజకవర్గంలో జనసేన ఆవిర్భావ దినోత్సవం. బాపిరాజు.



**గోపాలపురం,పెన్ పవర్, ఫిబ్రవరి 13.**జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలునియోజకవర్గ వ్యాప్తంగా శనివారం ఘనంగా జరపనున్నట్లు జనసేన పార్టీ నల్లజర్ల మండల శాఖ అధ్యక్షులు చోడసాని బాపిరాజు తెలిపారు. గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాల్లో ఈ వేడుకలకు నియోజకవర్గ ఇన్చార్జ్ దొడ్డి గర్ల సువర్ణ రాజు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. గోపాలపురంలో మండల శాఖ అధ్యక్షులు పోల్నాటి రాజేంద్ర అధ్యక్షతన గోపాలపురం లోను, దేవరపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు కంబాల సత్తిబాబు పర్యవేక్షణలో దేవరపల్లిలో, నల్లజర్లలో బాపిరాజు ఆధ్వర్యంలో ఈ వేడుకలు పార్టీ అధినేత కే పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు జరగనున్నట్లు ఆయన తెలిపారు. శనివారం ఉదయం జరిగేఈ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు జనసేన సైనికులు, వీర మహిళలు,నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

## పూడికతీస్తారు..కుప్పగా వేస్తారు



**ఏలూరు మిర్చి 13 పెన్‌పవర్ :** ఏలూరు నగర పాలక సంస్ద పరిధిలోని 18వ డివిజన్ రాజీవ్ గృహకల్ప కాలనీలో మురుగు కాలువలను పారిశుధ్య కార్మికులు శుభ్రం చేసి వ్యర్ధాలను రహదారులపైనే పక్కనే కుప్పగా పడేస్తున్నారు మూడు నెలలుగా ఆ కుప్పలను తీయకపోవడంతో ఎండిపోయి అటుగా రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులు పాదచారులకు ఇబ్బందులు తప్పడంలేదు.మరోవైపు దుర్వాసనతో ముక్కులు మూసుకోవాల్సి వస్తోందని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# నేడు కొన్ని ప్రాంతాలలో విద్యుత్ నిలుపుదల ఎ ఈ సుబ్రమణ్యం.



**గోకవరం పెన్ పవర్ మార్చి 13 :**--గోకవరం మండలం లోని 33/11 కె వి గోకవరం సబ్ స్టేషన్ విద్యుత్ మరమ్మత్తులు చేస్తున్నందున శనివారము మండలం లోని కొన్ని గ్రామాల్లో ఉదయం 07:00 గం.ల నుండి మధ్యాహ్నం 12:00 గం.ల వరకు రాజమహేంద్రవరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.పి.బి నటరాజన్ ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ప్రజలు అర్థం చేసుకుని సహకరించాలని గోకవరం సబ్ స్టేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ సుబ్రమణ్యం కోరారు.గోకవరం మండలంలో గోకవరం,వీరలంకపల్లి, రంపఎర్రంపాలెం ,పెంటపల్లి,కృష్ణునిపాలెం, చిన్నూరు, వెంకటాపురం, కొత్తూరు, రామన్నపాలెం, రామానుజా పురం, ఆర్ & ఆర్ (గోదావరి పంచాయతీ)కాలనీలకు విద్యుత్ సరఫరా మధ్యాహ్నం వరకు ఉండదని ప్రజల సహకరించాలని ఏఈ కోరారు.

## నదీ కోత నివారణకు చర్యలు: ఎమ్మెల్యే బండారు





**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 13:**ఆత్రేయపురం మండలం రాజవరంలో గోదావరి నదీ కోతకు గురవుతున్న లంక పొలాలను శుక్రవారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. గతంలో జరిగిన మట్టి తవ్వకాల వల్ల నేల వదులై పొలాలు గోదావరిలో కలిసిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నదీ కోతను అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రోయిన్ల నిర్మాణానికి సుమారు రూ.38.50 కోట్లు అవసరమని అధికారులు తెలిపినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు, సంబంధిత శాఖ మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రతిపాదనలు ఆమోదం పొందగానే గ్రోయన్ల నిర్మాణానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే అన్నారు.

# సీఐ తిరుపతిరావును కలిసిన గండేపల్లి మండల నాయకులు



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 13**: జగ్గంపేట సర్కిల్ ఇన్ స్పెక్టర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన తిరుపతిరావును శుక్రవారం జగ్గంపేట సర్కిల్ కార్యాలయం వద్ద గండేపల్లి జడ్పిటిసి పరిమిబాబు, గండేపల్లి మండల తెలుగు యువత అధ్యక్షులు సుంకవల్లి రమేష్, పైపూరి సారంగబాబు, బొగత నూకరాజు, గుర్రాల చిన్ని శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా సీఐ తిరుపతిరావును సాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో గండేపల్లి, కిర్లంపూడి ఎస్సైగా విధులు నిర్వహించిన తిరుపతిరావు అందరితో స్నేహభావంతో మెలుగుతూ ఎవరికి ఎటువంటి ఇబ్బందులు వచ్చినా వాటిని సరి చేస్తూ విధులు నిర్వహించే వారిని ఇటువంటి వ్యక్తి మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకుంటున్నామని తెలిపారు.

# గిరిజన రైతులకు రూ.24.56 కోట్ల చెక్కుల పంపిణీ





- పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలి
- ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, మార్చి 13 :**పోలవరం జిల్లాలోని గిరిజన రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రంపచోడవరం ఎమ్మెల్యే, లెజిస్లేటివ్ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీష దేవి అన్నారు.శుక్రవారం రంపచోడవరం ఐటీడీఏ సమావేశపు హాలులో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల ద్వారా రైతులకు మూడో విడత చెక్కు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎస్. బొజ్జి రెడ్డి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె సునీత తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాయని తెలిపారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల ద్వారా ఇప్పటికే రెండు విడతల్లో రైతుల ఖాతాల్లో రూ.14 వేల చొప్పున జమ చేశామని, ఈ రోజు మూడో విడతలో ఒక్కో రైతుకు రూ.6 వేల చొప్పున జమ చేస్తున్నామని తెలిపారు. రైతులు పండించే జీడిపిక్కలు, పసుపు, జాఫ్రా, కొండచిపుర్లు వంటి ఉత్పత్తులకు గిట్టుబాటు ధర అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయించే అవకాశం కల్పించామని, ధాన్యం విక్రయించిన రైతులకు 24 గంటల్లోనే డబ్బులు వారి ఖాతాల్లో జమ అవుతున్నాయని తెలిపారు. మహిళా రైతులకు డ్రోన్లు, గిరిజన రైతులకు సబ్సిడీపై ట్రాక్టర్లు, బొలెరో వాహనాలు అందిస్తున్నామని, మహిళా సంఘాలకు పాడి గేదెలు అందజేస్తున్నామని చెప్పారు.రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎస్. బొజ్జి రెడ్డి మాట్లాడుతూ రైతుల ఆర్థికాభివృద్ధి కోసం 2019లో పీఎం కిసాన్ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ రైతులకు డ్రిప్ సదుపాయాలు, వ్యవసాయ పరికరాలు సబ్సిడీపై అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆయిల్ పామ్ తోటల పెంపుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలోని 12 మండలాల్లో మొత్తం 40,358 మంది గిరిజన రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.16.14 కోట్లు, పీఎం కిసాన్ పథకం ద్వారా రూ.8.42 కోట్లు కలిపి మొత్తం రూ.24.56 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు.అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదుగా రైతులకు రూ.24.56 కోట్ల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగాలను ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతులకు వినిపించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, ఐటీడీఏ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# పప్పు లేని బువ్వ..!





- సెక్టార్‌లో సూపర్‌వైజర్ల
- పర్యవేక్షణ కరవు

**ఏలూరు మార్చి 13,పెన్‌పవర్ :** ఏలూరు నియోజకవర్గం ఏలూరు అంగన్ వాడీ ప్రాజెక్టు చాటపర్రు సెక్టార్ పరిధిలో ఏలూరు–3 గులాబితోట105 కేంద్రంలో అంగన్ వాడీ చిన్నారులకు పప్పులేని బువ్వపెడుతున్నారు.కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతలు,పిల్లలకు మధ్యాహ్నభోజనం కింద సోమవారం నుంచి శనివారం వరకు పప్పు తప్పనిసరిగా వండాల్సి ఉంది.ఆకుకూరల్లోనూ కందిపప్పు వాడాలి.కానీ కేంద్రానికి సరఫరా నిలిచి పోవడంతో సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు.సమ్మెకాలంలో సరుకు ఇవ్వకపోయినా..గతంలో వైకాపా పాలనలో అంగన్‌వాడీ కార్యకర్తలంతా వేతనాలు,ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మెకు దిగారు. అప్పట్లో కేంద్రాలను తెరవలేదు.ఆ సమయంలో అవసరమయ్యే ఇండెంట్ ఆన్‌లైన్‌లో పెట్టకపోవడంతో అప్పట్లో రెండు మూడు నెలలు సరకులు నిలిచిపోయాయి.ఆ తర్వాత రెండు నెలలకు సంబందించి ఇండెంట్ పెట్టమని సరుకులు ఇచ్చేశామని అధికారులు చెబుతున్నారు.క్షేత్ర స్థాయిలో మాత్రం గర్భిణులు, బాలింతలు సరకులు అందలేదని పేర్కొంటున్నారు.కార్యకర్తలు సైతం దీనిపై ఉన్నతాదికారులను ప్రశ్నిస్తే తమను ఎక్కడ ఇబ్బందులకు గురిచేస్తారోనని భయపడి చేసేది లేక మిన్నకుండి పోయారు. ఏలూరు ప్రాజెక్టు చాటపర్రు సెక్టార్ పరిధిలో ఏలూరు 1,2,3,వెంకటాపురం–2 సెక్టార్ల అంగన్ వాడీ కేంద్రాల్లో గర్భిణులకు కందిపప్పు ఇంటికే సరఫరా చేస్తారు.చిన్నారులకు వండి పెట్టాలి.కానీ వీరికి వండకుండా ఎగ్గొట్టే పరిస్థితులు సగం కేంద్రాల్లో నెలకొంటుంది కొన్ని చోట్ల పూర్తిగా సరఫరా చేయటం లేదు.కందిపపప్పు రేషన్ డిపోల నుంచి ఇచ్చే సమయంలో బయోమెట్రిక్ పరికరంలో సాంకేతిక లోపం అనే సాకుతో చాలా చోట్ల ఇవ్వడంలెదు.దీనిపై కార్యకర్తలు అడిగే పరితి లేదు.అదికారులు స్పందించి సెక్టార్ల పరిధిలో సూపర్ వైజర్ల పనితీరును మెరుగుపరచి,కేంద్రాల నిర్వహణ మెరుగు పరచాలని చిన్నారుల తల్లి తండ్రులు కోరుతున్నారు.

**చిన్నారులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో అంగన్ వాడీ కేంద్రాల్లోనూ భోజనాలు వండిపెడుతున్నారు.గత రెండు నెలలుగా ఏలూరు ప్రాజెక్టు పరిధిలోని ఏలూరు సెక్టార్-1,2,3,వెంకటాపురం-2 సెక్టార్లు పర్యవేక్షణా నిర్లక్ష్యానికి గురవుతున్నాయి..**
**మెనూలో పప్పు తప్పనిసరైనా లేకుండా పోతోంది.ఇటు పప్పు లేక అటు భోజనం వండలేక పలు కేంద్రాల్లో కార్యకర్తలు బయట కొనుగోలు చేసి చిన్నారులకు వండిపెడుతున్నారు.వీరిపైఆర్థిక భారం పడుతోంది.**
**ఫలితంగా ఇటు పప్పుకు,కొన్ని సెంటర్లలో మెనూకు మంగుళం పాడేస్తున్నారు.సెక్టార్ల సూపర్‌వైజర్లు చెరవాణిలో కూడా అందుబాటులో ఉండడం లేదని చిన్నారుల తల్లి తండ్రుల నుంచి ఆరోపణలు వ్యక్తమౌతుర్నాయి.**

## మార్చి 15న ఎఫ్.ఎల్.ఎన్.ఏటీ పరీక్ష ప్రారంభం ఎంపీడీవో కుమార్...

**అడ్డతీగల, పెన్ పవర్, మార్చి 13:** అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా అడ్డతీగల మండలంలో పునాది అక్షరాస్యత, సంఖ్యాశాస్త్ర మూల్యాంకన పరీక్ష (ఎఫ్ఎల్ఎన్ఏటీ)ను ఈ నెల 15న నిర్వహించనున్నట్లు ఎం.పీ.డీ.వో ఏ.వి.వి కుమార్ తెలిపారు. మండలంలో మొత్తం 7,084 మంది అభ్యాసకులు పరీక్షకు హాజరుకానుండగా, 173 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో పారిశుధ్యం, త్రాగునీటి సదుపాయాలు కల్పించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. సమీక్షా సమావేశంలో ఎం.ఈ.ఓ కె.రమేష్, ఎన్.ఆర్.ఈ.జీఎస్ ఏపీఓ బి.చిరంజీవి, వెలుగు ఏ.పీ.ఓ బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# అడ్డతీగల మండలా విద్యాశాఖ సంఘానికి కోశాధికారిగా ఎంఈఓ పి. శ్రీనివాసరావు...







**అడ్డతీగల,పెన్ పవర్, మార్చ్13:** పోలవరం జిల్లా స్థాయిలో మండల విద్యాశాఖ అధికారులు2 సంఘానికి నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకునే ప్రక్రియ ఇటీవల నిర్వహించబడింది. ఈ ఎన్నికల్లో వివిధ మండలాలకు చెందిన విద్యాశాఖ అధికారులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. విద్యా వ్యవస్థ అభివృద్ధి, పాఠశాలల నిర్వహణలో సమన్వయం పెంపు, విద్యా ప్రమాణాల మెరుగుదల లక్ష్యంగా ఈ ఎన్నికలు ప్రాముఖ్యత సంతరించుకున్నాయి.ఈ సందర్భంగా అడ్డతీగల మండలానికి చెందిన మండల విద్యాశాఖ అధికారి పి. శ్రీనివాసరావు జిల్లా కార్యవర్గంలో కోశాధికారిగా ఎన్నికయ్యారు. ఆయన నియామకాన్ని సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. విద్యా రంగంలో అనుభవం కలిగిన శ్రీనివాసరావు బాధ్యతలను సమర్థంగా నిర్వహించి,సంఘ అభివృద్ధికి తోడ్పడతారని సభ్యులు విశ్వాసం వ్యక్తం చేశారు.

## ప్రపంచకప్ జట్టులోని సంజు శాంసన్ ఫోటోని తొలగించిన టీమిండియా కెప్టెన్..









**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్ 2026 విశ్వవిజేతగా టీమిండియా నిలిచింది. మార్చి8వ తేదీన అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ పై 96 పరుగుల తేడాతో గెలిచి మూడోసారి పొట్టి కప్ ని ముద్దాడింది. ఈ ప్రపంచకప్ గెలవడంలో సంజూ శాంసన్ కీలక పాత్ర పోషించాడు. సూపర్--8లో వెస్టిండీస్ పై 97 పరుగులు, సెమీఫైనల్ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ పై 89 రన్స్ తో పాటు ఫైనల్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ పై 89 పరుగులు చేశాడు. దీంతో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డును కూడా సంజు శాంసన్ కైవసం చేసుకున్నాడు. ఇండియన్ టీమ్ టీ20 వరల్డ్ కప్‌ను గెలవడంతో టెస్టు, వన్డే కెప్టెన్ అయిన శుభ్‌మన్ గిల్ సోషల్ మీడియా వేదికగా భారత జట్టుకి శుభాకాంక్షలు చెప్పాడు. టీమిండియా ప్రపంచ కప్ ట్రోఫీని అందుకునే సమయలో దిగిన ఫోటోను తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పోస్టు చేశాడు. కానీ ఇప్పుడు ఈ ఫోటో పైనే తీవ్ర వివాదం కొనసాగుతుంది. గిల్ పోస్ట్ చేసిన ఫోటోలో సంజూ శాంసన్ కనిపించడం లేదని క్రికెట్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కావాలనే ఫోటోలో శాంసన్‌ను గిల్ తీసివేశాడని కామెంట్స్ చేస్తున్నారు. టీమ్ లో గిల్ స్థానంలో సంజు శాంసన్ కి చోటు దక్కడం వలన కోపంతో ఉన్న టీమిండియా వన్డే, టెస్టుల కెప్టెన్ గిల్ ఇలా పగ తీర్చుకున్నాడుని తెలుస్తుంది. ఇక అదే రోజు సూర్యకుమార్ యాదవ్ పోస్ట్ చేసిన ఫోటోలో సంజూ శాంసన్ కనిపించడాన్ని ప్రస్తావిస్తున్నారు. అదే ఫోటోను గిల్ ఎడిట్ చేసి పోస్ట్ చేశాడా? అని క్వశ్చన్ చేస్తున్నారు. వాస్తవానికి శుభ్‌మన్ గిల్.. సంజు శాంసన్ ను ఫోటో నుంచి తొలగించే ఛాన్స్ లు చాలా తక్కువగా ఉన్నాయి. ఎందుకంటే టీ20 వరల్డ్ కప్ 2026 వేడుకల రోజున తీసిన చాలా ఫోటోలు సోషల్ మీడియాలో దర్శనమిస్తున్నాయి. యశస్వి జైస్వాల్ కూడా టీమిండియాకు అభినందలు తెలుపుతూ చేసిన ఫోటోలోనూ సంజూ కనిపించలేదు..

## అన్ని టీమ్స్ ఈ రూల్స్ పాటించాల్సిందే.. ఐపీఎల్ ప్రారంభానికి ముందు బీసీసీఐ కఠిన ఆంక్షలు..




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (IPL) 2026లో జరిగే 19వ ఎడిషన్ మరి కొద్ది రోజుల్లోనే ప్రారంభం కానుంది. మార్చి 28వ తేదీన బెంగళూరులోని ఎం.చిన్నస్వామి స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్స్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB) వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH) మధ్య మ్యాచ్‌తో మెగా టోర్నమెంట్ స్టార్ట్ అవుతుంది. మెగా టోర్నమెంట్ ప్రారంభానికి కేవలం రెండు వారాల సమయం మాత్రమే ఉండటంతో, భారత క్రికెట్ నియంత్రణ మండలి (BCCI) 10 ఫ్రాంచైజీలు అనుసరించాల్సిన కొన్ని కీలక సూచనలను జారీ చేసింది.క్రిక్‌బజ్ నివేదిక ప్రకారం.. ఏ జట్టు కూడా ప్రత్యర్థి జట్టు ఉపయోగించిన అదే పిచ్‌పై ప్రాక్టీస్ చేయకూడదు, ఒకేసారి రెండు జట్లకు ప్రాక్టీస్ సెషన్‌లలు నిర్వహించొద్దు.. ప్రతి జట్టుకు కేటాయించిన ప్రాక్టీస్ సెషన్ కోసం కొత్త నెట్‌లు తప్పనిసరిగా అందించాలని బీసీసీఐ ఫ్రాంచైజీలకు సూచించింది. అన్ని ఫ్రాంచైజీ తన తొలి హోమ్ మ్యాచ్‌కు నాలుగు రోజుల ముందు నుంచి స్టేడియంలోని ప్రధాన పిచ్‌పై ప్రాక్టీస్ చేయకూడదని వెల్లడించింది. ఈ కాలంలో ప్రాక్టీస్ చేయడానికి ప్రత్యామ్నాయ మైదానాన్ని సంబంధిత రాష్ట్ర క్రికెట్ బోర్డు ఫ్రాంచైజీకి ఎలాంటి ఖర్చు లేకుండా అందించాలని తెలిపింది.ఐపీఎల్ సీజన్ కోసం పిచ్‌ను సిద్ధం చేయడానికి, సంబంధిత ఫ్రాంచైజీ యొక్క తొలి హోమ్ మ్యాచ్‌కు ముందు నాలుగు రోజులలో ప్రధాన పిచ్ పై ఎటువంటి ప్రాక్టీస్ సెషన్‌లు లేదా ప్రాక్టీస్ మ్యాచ్‌లు జరగకూడదు అని బీసీసీఐ పేర్కొంది. ఈ కొత్త మార్గదర్శకాలు ఫ్రాంచైజీలకు సమయాన్ని సకాలంలో వినియోగించుకునేలా, పిచ్ పరిస్థితులను రక్షించడానికి రూపొందించబడ్డాయి.

## సన్‌రైజర్స్ లీడ్స్ జట్టులో పాక్ ప్లేయర్.. బీసీసీఐ రియాక్షన్ ఇదే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్ లో జరగనున్న 'ది హండ్రెడ్' లీగ్ వేలంలో భాగంగా పాకిస్తాన్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్‌ను సన్‌రైజర్స్ లీడ్స్ జట్టు రూ.2.34 కోట్లకు దక్కించుకున్న విషయం తెలిసిందే. దీనిపై భారత్ లో తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. ఓ భారతీయ ఫ్రాంచైజీ పాక్ ప్లేయర్‌ను కొనుగోలు చేయడంపై క్రికెట్ ఫ్యాన్స్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేలంలో సన్‌రైజర్స్ సీఈవో కావ్య మారన్, హెడ్ కోచ్ డానియల్ వెట్టోరి పాల్గొన్నారు. దీంతో ఐపీఎల్ 2026లో కూడా సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఆడే మ్యాచ్‌లను బాయ్‌కాట్ చేయాలంటూ సోషల్ మీడియాలో ఫ్యాన్స్ పోస్టులు పెడుతున్నారు. దీంతో ఎట్టకేలకు ఈ వివాదంపై బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా రియాక్ట్ అయ్యారు. ఇది ఐపీఎల్‌కు సంబంధించిన విషయం మాత్రం కాదు.. విదేశీ లీగ్‌లో జరిగిన వ్యవహారం.. అందువల్ల ఈ అంశంపై బీసీసీఐ జోక్యం చేసుకునే ఛాన్స్ లేదన్నారు. అది ఆ ఫ్రాంచైజీదే తుది నిర్ణయం అని స్పష్టం చేశారు. గతేడాది ఆపరేషన్ సింధూర్ సమయంలో అబ్రార్ ఇండియన్ ఆర్మీని విమర్శిస్తూ మైదానంలోనే రెచ్చిపోయాడు. అలాంటి సదరు పాక్ ప్లేయర్‌ను సన్‌రైజర్స్ లీడ్స్ ఫ్రాంచైజీ కొనుగోలు చేయడంపై పెద్ద ఎత్తున విమర్శలు కొనసాగుతున్నాయి. టీమిండియా వర్సెస్ –పాకిస్తాన్ మధ్య రాజకీయ ఉద్రిక్తతలతో 2008 తర్వాత ఇప్పటి వరకు పాక్ కి చెందిన ఏ అంతర్జాతీయ ఆటగాడు కూడా ఐపీఎల్ టోర్నీలో ఆడలేదు. కానీ ప్రపంచంలోని ఇతర టీ20 లీగ్‌లలో మాత్రం ఐపీఎల్ యాజమాన్యంలోని జట్లు పాకిస్థాన్ ప్లేయర్స్ ని తీసుకున్న విషయం తెలిసిందే.

## 'రామాయణ 2'.. నితేష్ తివారీ ధీమా వెనుక అసలు కథేంటి?

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో ఒక భారీ ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్తుందంటేనే ఎన్నో లెక్కలు ఉంటాయి. అలాంటిది పార్ట్ 1 విడుదల కాకముందే, రెండో భాగం షూటింగ్ మొదలుపెట్టడం అనేది మామూలు విషయం కాదు. గతంలో రాజమౌళి 'బాహుబలి'కి, మణిరత్నం 'పొన్నియిన్ సెల్వన్'కు ఇలాంటి సాహసమే చేశారు. ఇప్పుడు నితేష్ తివారీ తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'రామాయణ' విషయంలో అదే బాటలో పయనిస్తున్నారు. అసలు మొదటి భాగం ఫలితం తెలియకుండానే రెండో భాగంపై ఇంతటి ధీమా చూపించడం వెనుక ఉన్న రహస్యం ఏంటనేది ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. ?దీనికి ప్రధాన కారణం లాస్ ఏంజిల్స్‌లో జరిగిన ఒక ప్రత్యేక స్క్రీనింగ్ అని తెలుస్తోంది. పార్ట్ 1 కి సంబంధించిన రఫ్ కట్‌ను అక్కడ ప్రదర్శించగా, విజువల్స్ కథా గమనం చూసి మేకర్స్ షాక్ అయ్యారట.



హాలీవుడ్ స్థాయి టెక్నికల్ వాల్యూస్‌తో సినిమా అద్భుతంగా వచ్చిందనే నమ్మకం కలగడంతో, ఏమాత్రం ఆలస్యం చేయకుండా పార్ట్ 2 పనులను వేగవంతం చేశారు. రన్బీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా ఇప్పటికే తమ పాత్రల్లో పరకాయ ప్రవేశం చేయడంతో, అదే ఫ్లోలో లంక ప్రయాణానికి సంబంధించిన కీలక ఘట్టాలను కూడా పూర్తి చేయాలని దర్శకుడు భావిస్తున్నారు. ?ఇలా రెండు భాగాలను ఏకకాలంలో ప్లాన్ చేయడం వెనుక ఒక బలమైన ప్లస్ పాయింట్ ఉంది. నటీనటుల లుక్స్ వారి బాడీ లాంగ్వేజ్‌లో ఎటువంటి తేడా రాకుండా జాగ్రత్త పడవచ్చు. ముఖ్యంగా రామాయణం లాంటి ఇతిహాసాన్ని వెండితెరపై చూపిస్తున్నప్పుడు కంటిన్యూటీ చాలా ముఖ్యం. లంక వైపు సాగే ప్రయాణం, హనుమంతుడిగా సన్నీ డియో ఎంట్రీ వంటి కీలక సీన్లు పార్ట్ 2 లోనే ఎక్కువగా ఉంటాయి. అందుకే ఒక షెడ్యూల్ పూర్తి కాగానే వెంటనే రెండో భాగం సెట్స్‌ను సిద్ధం చేసి, షూటింగ్ గ్యాప్ లేకుండా చూసుకుంటున్నారు. ?అయితే ఇందులో రిస్క్ కూడా లేకపోలేదు. సుమారు రూ. 4000 కోట్ల భారీ పెట్టుబడితో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌లో పార్ట్ 1 ఫలితంపైనే పార్ట్ 2 భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. ఒకవేళ మొదటి భాగానికి ఆశించిన స్పందన రాకపోతే రెండో భాగం పరిస్థితి ఏంటనే ప్రశ్న సహజంగానే వస్తుంది. కానీ రామాయణంకు ఉండే బజ్ వేరు, దాన్ని సరైన పద్ధతిలో విజువల్ వండర్‌గా చూపిస్తే ప్రేక్షకులు ఖచ్చితంగా ఆదరిస్తారనేది మేకర్స్ నమ్మకం. పైగా యాష్ లాంటి స్టార్ రావణుడిగా నటిస్తుండటం సినిమాకు పాన్ ఇండియా స్థాయిలో పెద్ద క్రేజ్‌ను తెచ్చిపెడుతోంది. ?ప్రస్తుతం ముంబైలో జరుగుతున్న షెడ్యూల్‌లో రాముడి వనవాసం తర్వాత జరిగే కీలక ఘట్టాలను చిత్రీకరిస్తున్నారు. సీతమ్మ అపహరణ తర్వాత రాముడిలోని అలజడి, ఆపై హనుమంతుడిని కలవడం వంటి భావోద్వేగ సీన్లతో పాటు భారీ యుద్ధ సన్నివేశాలను కూడా ఈ షెడ్యూల్‌లో ప్లాన్ చేశారు. టెక్నాలజీ పరంగా కూడా ఎక్కడా రాజీ పడకుండా, అంతర్జాతీయ సాంకేతిక నిపుణుల సలహాలతో విజువల్ ఎఫెక్ట్స్‌ను రూపొంది స్తున్నారు. 2026 దీపావళికి మొదటి భాగం విడుదల చేసేలా మేకర్స్ పక్కా ప్రణాళికతో ఉన్నారు. 'రామాయణ' టీమ్ చేస్తున్న ఈ సాహసం భారతీయ సినిమా స్థాయిని మరో మెట్టు ఎక్కించేలా కనిపిస్తోంది. మరి 2027లో రాబోయే రెండో భాగం నాటికి మొదటి భాగం ఎటువంటి అంచనాలను క్రియేట్ చేస్తుందో వేచి చూడాలి.



పెద్ది పట్ల తనకున్న ప్రేమను వ్యక్తం చేసింది వేదవికా



అద్భుతమైన ఎత్నిక్ లుక్‌తో సంయుక్తా మీనన్ తలదాచుకుంది

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965